₹ 10/-

జనరాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్


సంపుటి-2 సంచిక - 6 పక్షపత్రిక మార్చి 16-31, 2011




కాకరాపల్లిపై లోక్‌సత్తా నిజ నిర్ధారణ నివేదిక

ఓడరేవులకు భూకేటాయింపుపై చర్చ




## వాకౌట్ల కంటే వాదనే మిన్న...




# పోర్టుల పేరుతో తీరం కబ్జా



# సంస్కృతీ చిహ్నాలపై సంకుచిత రాజకీయమా ?

# జేపీ పై దాడికి నిరసనగా



అనంతపురంలో....



విజయనగరం లో....



ఒంగోలు లో....



ఒంగోలు జేపీపై దాడికి నిరసనగా తెలియజేస్తూ....



గుంటూరు లో....



రాజమండ్రిలో



భీమవరం
ప్రజా సమస్యలపై మెమోరాండం



గ్రామ యువజన నాయకత్వ శిక్షణ శిబిరం సందర్భంగా....

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 2 సంచిక - 6 పక్షపత్రిక మార్చి 16-31, 2011

## లోపలి పేజీల్లో...


పోర్టుల పేరుతో సముద్రతీరం కబ్జా............. 5
సీవీసీ నియామకంపై సుప్రీకోర్టు తీర్పు........ 11
అమెరికాలో దండియాత్ర - 2.................... 12
ప్రజాస్వామ్య పాలన కోసం.......................... 13
విద్యుత్తు ప్రాజెక్టులపై విధానాలు లేని ప్రభుత్వం....... 16
కాకరాపల్లి థర్మల్ ప్రాజెక్టు అనుమతులు...... 17
థర్మల్ కేంద్రాలు, సెజ్‌లు, పోర్టులకు భూసేకరణ..... 19
భారత తత్వాన్ని ఆవిష్కరించిన సచ్చిదానందమూర్తి.. 20
శరవేగంలో నగరాలు – చాలీ చాలనీ .......... 23
వ్యవసాయాన్ని లాభసాటి చేసే వ్యూహం....... 24
అంకెలకి, ఆచరణకి పొంతనలేని................ 26
సంస్థాగత విస్తరణ దిశగా లోక్‌సత్తా............ 27
సంస్థాగత ఎన్నికల నియమావళి................ 28
రాజకీయ పార్టీ ఉపాధి వారధి.................... 30
రాష్ట్ర మహిళా కమీషన్‌ను నియమించండి.. 31
జిల్లాల్లో లోక్‌సత్తా కార్యకలాపాలు................ 32



### సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు


# తెలుగు భాషా సంస్కృతీ చిహ్నాలపై సంకుచిత రాజకీయం తగదు

తెలుగుభాష మాట్లాడేవారు ఈ రాష్ట్రంలో వున్నారు. రాష్ట్రం వెలుపల దేశమంతటా వున్నారు. ప్రపంచంలో చాలా దేశాలలో వున్నారు. రాష్ట్రంలో 8 కోట్ల మంది వుంటే రాష్ట్రం వెలువల మరో 6 కోట్ల మంది వున్నారని లెక్కలు చెబుతున్నారు. ఎవరు ఎక్కడ నివసించినా, ఏ కులానికి మతానికి ప్రాంతానికి చెందిన వారైనా, ఎన్ని మాండలికాలు మాట్లాడేవారేనా...వారి మధ్య ఎన్ని విభేదాలున్నా తెలుగు మాతృభాషగా కలవారిని ఒక ఉపజాతిగా రూపుదిద్దింది భాష సంస్కృతీ వారసత్వమే. సాహితీమూర్తులు, సంఘసంస్కర్తలు విశ్వజనీనమైన భావాలను ప్రతిపాదించారు. సమాజాన్ని మరింత సంస్కారయుతం చెయ్యడానికి పునాదులు వేశారు. ఏ జాతీ తన పునాదుల్ని తాను తవ్వుకోదు. అలా తవ్వుకుంటే అది గోతిలో పడుతుంది. పునాదుల్ని కూల్చుకుంటే జాతి జన జీవనం తెగిన గాలిపటం అవుతుంది.

టాంక్‌బండ్ మీద పెట్టిన ప్రతి విగ్రహం వెనక ఒక చరిత్ర వుంది. ఒక ఘనత వుంది. ఇలాంటి మహనీయులు ఇంకా ఎందరో వున్నారనడంలో సందేహం లేదు. వారికి కూడా స్మృతి చిహ్నాలను కోరడంలో న్యాయం వుంది. కాని ఒక న్యాయం కోసం చేసే పోరాటం మరొక అన్యాయానికి దారి తీస్తే, అది విధ్వంసకుల మార్గం అవుతుంది. కాని విజ్ఞుల మార్గం కానేరదు.

తెలుగులో భాగవతానికి కర్త బమ్మెర పోతన దగ్గర ప్రతిజ్ఞ చేసి మహాభారత కర్త ఎర్రాప్రగడను కూల్చడం అవివేకం అవుతుంది. రేపు రాష్ట్రం విడిపోతే తెలంగాణా బొమ్మల కొలువులో భాగవతమే కాని భారతం లేకుండా పోతుందా! సాంస్కృతిక పునరుజ్జీవానికి, సామాజిక విప్లవాలకి ప్రేరణ

# రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

## మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఇం. నం. 5-10-180/ఎ&ఎ1, బ్యాండ్‌లేన్స్
హిల్‌ఫోర్ట్ రోడ్, హైదరాబాద్ - 500 004
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

## లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**
ఫోటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

పొందడానికి విధ్వంసంలో నేలకొరిగిన వారి నుండి ప్రేరణ లేకుండా పోతుందా! అందుచేత ఈ విధ్వంసకాండ ఎవరు పురికొల్పినా, ఎవరు కారకులైనా వారంతా తెలుగు సాంస్కృతిక వారసత్వానికి ధ్వంసరచన చేసిన వారౌతారు. దీనిని మరికొందరు మహనీయులతో పరిపుష్టం చెయ్యాల్సింది పోయి ఉన్నవాటిని ఊడగొట్టడం మనం కూర్చున్న కొమ్మని మనమే నరుక్కోవడం అవుతుంది.

ఈ విధ్వంసకాండని ప్రాంతాలకు అతీతంగా అందరూ ఖండించడం ఆహ్వానించదగ్గ పరిణామం. తెలంగాణా ప్రాంతం నుండి మరికొందరు మహనీయుల విగ్రహాలను జతచెయ్యాలని సూచించడం సహేతుకం.

ప్రజాస్వామబద్ధంగా, శాంతియుతంగా, రాజ్యాంగవ్యవస్థల ప్రక్రియల ద్వారా తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడం తప్ప ప్రజాస్వామ్యంలో మరో మార్గం లేదు. విధ్వంసం, హింస అనేవి ఉద్యమాలకు తాత్కాలిక ప్రచార సాధనాలుగా వినియోగపడినా అంతిమంగా అవే ఉద్యమానికి ప్రతికూలం అవుతాయి. ప్రజాస్వామిక శక్తులు దూరం అవుతాయి. అందుచేత ఆందోళనలు నిర్వహించే సంస్థలు, పార్టీలు దీనిని గుర్తించాలి. ఆచరణలో ఈ పద్ధతులకు దూరంగా వుండాలి.

ఒక పక్క విగ్రహాలను కూల్చేవారు, మరొక పక్క ప్రతిష్ఠించేవారు లేదా వాటికి పోలీసు పహరాలు పెట్టడం ఆ మహనీయులకు గౌరవప్రదం కాకపోగా అపచారం అవుతుంది.

విగ్రహాలని కూల్చినవారు లేదా దానిని ప్రోత్సహించిన వారు ఇప్పటికీ దానిని సమర్థిస్తున్నవారు ఈ మహనీయులని కూడా తెలుగుభాషా సంస్కృతి వారసత్వ సంపదగా భావించినప్పుడు మాత్రమే వాటి పునఃప్రతిష్ట సముచితంగా వుంటుంది. ఈ సంఘటలకు కారకులు ఎవరైనా మిలియన్ మార్చ్‌కి పిలుపునిచ్చిన వారు దానికి బాధ్యత వహించి విగ్రహాల పునఃప్రతిష్టకు చొరవ తీసుకోవడం ఉచితంగా ఉంటుంది. ■

**దేశమును ప్రేమించుమన్నా**
**మంచియన్నది పెంచుమన్నా**
**వట్టిమాటలు కట్టిపెట్టోయ్**
**గట్టిమేల్ తలపెట్టవోయ్**

**పూనుస్పర్థలు విద్యలందే**
**వైరములు వాణిజ్యమందే**
**వ్యర్థ కలహం పెంచబోకోయ్**
**కత్తి వైరం కాల్చవోయ్!**

**దేశమనియెడి దొడ్డ వృక్షం**
**ప్రేమలను పూలెత్తవలెనోయ్**
**నరుల చమటను తడిసి మూలం**
**ధనం పంటలు పండవలెనోయ్!**

**చెట్టపట్టాల్ పట్టుకుని**
**దేశస్థులంతా నడువవలెనోయ్**
**అన్నదమ్ములవలెను జాతులు**
**మతములన్నీ మెలగవలెనోయ్**

– గురజాడ అప్పారావు

# పోర్టుల పేరుతో సముద్రతీరం కబ్జా

## అడ్డగోలు కేటాయింపులకు అడ్డుకట్ట వేసిన అర్థవంతమైన చర్చ

- వాదనాబలంతో, సాక్ష్యాధారాలతో అసెంబ్లీని ఆకట్టుకున్న జేపీ
- పార్టీలకు అతీతంగా గొంతుకలిపిన ఎమ్మెల్యేలు
- పునః సమీక్షకు ముఖ్యమంత్రి హామీ




*మూడు పోర్టులు... 385 కిలోమీటర్లు... అడ్డగోలుగా ప్రభుత్వం సముద్రతీరాన్ని ధారాదత్తం చేసింది. మనకి పోర్టులు కావాలి. వాటికి సముద్రతీరం కావాలి. ఎంత పోర్టుకి ఎంత తీరం కావాలన్న విచక్షణ ప్రభుత్వానికి లేదు. ప్రపంచంలో, దేశంలో చాలా పోర్టులున్నాయి. వాటికి కేటాయించిన తీరాన్ని పరిశీలించాలన్న ధ్యాస ప్రభుత్వానికి లేదు. తడ నుండి కాకినాడ వరకు సముద్రతీరంలో ప్రభుత్వానికి అంగుళం జాగా లేదు. కేంద్రం మరో పోర్టు పెట్టడానికి ముందుకు వస్తే దానికి కేటాయించడానికి సముద్రతీరం కరువైంది. సముద్రతీరం జాతి సంపద భవిష్యత్ తరాలకు కూడా దానిలో వాటా వుండాలి. కాని ఎం.ఓ.యు.ల పేరుతో సాగిన ఈ కబ్జాల భాగోతాన్ని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ శాసనసభలో ప్రశ్నించారు. వాకౌట్లకంటే వాదనాబలం గొప్పదని నిరూపించారు.*

*పార్టీలకు అతీతంగా శాసనసభ్యులు గళం కలిపారు. చివరికి ముఖ్యమంత్రి చర్చలో జోక్య చేసుకుని తీరం కేటాయింపులపై, భూసేకరణలపై పునఃసమీక్షకు అంగీకరించారు. అసెంబ్లీ చరిత్రలో నిలిచిపోయే ఈ అర్థవంతమైన చర్చ సాగిన తీరును పాఠకులకు అందిస్తున్నాం.*



రాష్ట్రంలో ప్రకృతివనరుల్ని నచ్చినవారికి అప్పనంగా ఇష్టమొచ్చినట్టు కేటాయించేసి ప్రజాప్రయోజనాలను గాలికొదిలేశారని, ఆంధ్రప్రదేశ్ దక్షిణకోస్తా తీరంలో ఒక పోర్టు–షిప్‌యార్డును ఏర్పాటుచేయటానికి కేంద్రప్రభుత్వం ముందుకొచ్చినా అందుకు తగ్గ స్థలాన్ని ఇవ్వకుండా రాష్ట్రప్రభుత్వం తాత్సారం చేస్తోందని జయప్రకాష్ నారాయణ్ 2010 సంవత్సరం చివరి నుంచీ రాష్ట్రంలో పర్యటిస్తున్న చోటల్లా విమర్శిస్తూ వచ్చారు. అయితే ప్రజల ఉపాధికి, రాష్ట్రాభివృద్ధికి ఎంతో కీలకమైన అంశమైనా రాష్ట్రప్రభుత్వం కనీస స్థాయిలో కూడా స్పందించి దానిపై వివరణ ఇవ్వలేదు. ప్రజల మౌలికసమస్యల మీద స్పందించాల్సిన మీడియా కూడా పట్టించుకోలేదు. అసలేం జరిగిందో పరిశోధించి ప్రజాప్రయోజనాలను కాపాడటానికి నడుంబిగించలేదు. ఆ వార్తను ప్రింట్ మీడియాలో ఒకట్రెండు పత్రికలు ఎక్కడో మూలన ప్రచురిస్తే, ఎలక్ట్రానిక్ మీడియా దాదాపు ప్రసారం చేయలేదు. దోపిడీకి గురవుతున్నది మన సొమ్మే, మన బిడ్డల భవిష్యత్తే అనే స్పృహ లేకుండా రాజకీయం అంటే ఏవో కొన్ని పార్టీల మధ్య మల్లయుద్ధం, మనం ప్రేక్షకులం మాత్రమే అనే ధోరణిలోనే ఇంకా కొనసాగుతున్న ప్రజలు కూడా దాన్నో విషయంగా భావించలేదు. ఆ భారీ ప్రజాధనం లూటీని, అధికార దుర్వినియోగాన్ని నిర్దిష్టంగా, సమగ్ర వివరాలతో ఫిబ్రవరి 28, 2011న అసెంబ్లీలో లేవనెత్తేందుకు కూకట్‌పల్లి శాసనసభ్యునిగా జయప్రకాష్ నారాయణ్ ప్రయత్నించారు. కానీ అసెంబ్లీలో చర్చించటం కన్నా బైట రచ్చ చేసి లబ్ధి పొందుదామని ప్రధాన రాజకీయపార్టీలు కూడా భావిస్తున్న నేపథ్యంలో ఆరోజున అది సాధ్యం కాలేదు. దాంతో అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దే జేపీ ఆ విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు తెలియచెప్పారు.




### జేపీ బైటపెట్టిన వివరాలు...

"రాష్ట్రంలో దక్షిణాదిన కృష్ణపట్నం, మచిలీపట్నం, వాన్‌పిక్ ఓడరేవుల నిర్మాణం పేరుతో ఏకంగా 348 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని ఒకే గ్రూపు సంస్థకు శాశ్వత ప్రాతిపదికన ఎం.వో.యూల పేరుతో రాసిచ్చేయటం వల్ల ఇప్పుడు ప్రభుత్వానికే ఎకరం స్థలం దొరకని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రజలకు చెందాల్సిన అత్యంత విలువైన సహజవనరులను పెద్దఎత్తున కేటాయింపులు చేస్తూ మన పాలకులు గుత్తాధిపత్యానికి తెరతీశారనటానికి ఇది తాజా ఉదాహరణ. పోర్టుల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్నందున కేంద్రప్రభుత్వమైనా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఆ ఎం.వో.యూలను రద్దుచేయాలి. దేశవ్యాప్తంగా తూర్పుతీరంలోని మేజర్‌పోర్టులకు 79 కిలోమీటర్ల తీరం కేటాయిస్తే మన రాష్ట్రంలో వస్తాయో లేదో తెలియని ప్రైవేటు పోర్టు (కృష్ణపట్నం, మచిలీపట్నం, వాన్‌పిక్ ఓడరేవులు) కోసం ప్రభుత్వం... కేంద్రానికి మాటమాత్రమైనా చెప్పకుండా 348 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని మరొకరు అడుగుపెట్టటానికి కూడా వీల్లేకుండా ఒకే గ్రూపునకు కేటాయించింది. ఈ 348 కిలోమీటర్లను కృష్ణపట్నం ఓడరేవుకు, దానికి ఉత్తరాన, దక్షిణాన ఎక్స్‌క్లూజివ్ జోన్ పేరుతో 153 కిలోమీటర్లు శాశ్వత ప్రాతిపదికన కేటాయించారు. అలాగే వాన్‌పిక్‌కు 92, మచిలీపట్నంకు 103 కిలోమీటర్లు చొప్పున అప్పనంగా ధారాదత్తం చేసేశారు. విశాఖలో నేవల్ బేస్ విస్తరణ కోసం కొంత తీరప్రాంతాన్ని కేటాయించినందుకు పరిహారంగా రక్షణశాఖ రూ.1000కోట్లు కేంద్రప్రభుత్వానికి ఇచ్చింది. ఆ డబ్బుతో దక్షిణాదిన ఒక పోర్టు, షిప్‌యార్డు నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని కేంద్రప్రభుత్వం రాష్ట్రాన్ని కోరింది. అయితే దక్షిణాదిన ఉన్న తీరప్రాంతాన్ని శాశ్వత ప్రాతిపదికన ఆ మూడు పోర్టులకు ఇచ్చేసినందున కొత్త పోర్టుకు, షిప్‌యార్డుకు అవసరమైన స్థలాన్ని కేటాయించలేమని, కావాలంటే విశాఖ పక్కనున్న నక్కపల్లిలో తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది. ప్రభుత్వానికి కూడా ఎకరం భూమి దొరకని పరిస్థితిని కల్పించారంటే రాష్ట్రంలో ఎంత దారుణమైన దోపిడీ రాజ్యం నడుస్తోందో ప్రజలు అర్థంచేసుకోవాలి" అని జయప్రకాష్ నారాయణ్ మీడియా ద్వారా పేర్కొన్నారు.

అంత పెద్దఎత్తున ప్రకృతి వనరుల్ని ఒకే గ్రూప్‌నకు గుత్తాధిపత్యంగా ఇచ్చేసినా కూడా ఒకట్రెండు పత్రికలు మినహా ఆ వార్తను ప్రచురించలేదు. అందులో ఒక పత్రిక ప్రముఖంగా

ప్రచురించటంతో వాస్తవాలు ప్రజల దృష్టికి వెళ్లింది. మరీ ఇంత దోపిడీయా అని దిగ్భ్రమచెందారు. అసెంబ్లీలో కూడా పార్టీలకతీతంగా ఎమ్మెల్యేలలో చాలామంది కూడా షాక్‌కు గురయ్యారు. వారిలో చాలామంది జేపీ దగ్గరకు వచ్చి తమ ఆందోళనను తెలియచేశారు కూడా. ఏదో అవినీతి జరిగింది, జరుగుతూ ఉంటుంది అనుకున్నాం తప్ప ఇలా గంపగుత్తగా రాష్ట్రాన్ని అమ్మేసినట్టు తమకు కూడా తెలియదని వారు అన్నారు. ఆ తర్వాత ఒక ఆంగ్ల పత్రికలో, మరో తెలుగుపత్రికలో పతాకశీర్షికలో ఈ వివరాలు రావటంతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఈ వార్త పాకిపోయి చర్యలు తీసుకోవటం తప్పనిసరి అయింది.

ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసేలా అసెంబ్లీలో చిరస్మరణీయ వాదనలు, విజయం

ఈ నేపథ్యంలో మార్చి 8, 2011న అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పోర్టులకు తీరప్రాంతాన్ని వందల కిలోమీటర్ల మేర గుత్తాధిపత్యం కేటాయించటాన్ని లేవనెత్తారు. అన్ని పార్టీల సభ్యులూ ఆయనకు అండగా నిలిచారు. దీంతో విస్తృతస్థాయి చర్చగా అది రూపుదిద్దుకుంది. ఎటువంటి వ్యక్తిగత దూషణలూ లేకుండా కేవలం హేతుబద్ధత, ప్రజాసంక్షేమం ప్రాతిపదికన బలమైన వాదనలతో, నిర్దిష్ట సాక్ష్యాలతో జయప్రకాష్ నారాయణ్ చేసిన వాదనలు అసెంబ్లీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. హింస, బంద్‌లు, రాస్తారోకోలు, అసెంబ్లీలో వీరంగం చేస్తే తప్ప ఏదైనా సాధించటం సాధ్యం కాదు అనుకున్నవారికి మన వాదనలో వాస్తవముంటే, మనలో చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వాన్ని ఒప్పించి మంచిని సాధించవచ్చు అని నిరూపించిన సందర్భమది. లోక్‌సత్తాకు సభలో కేవలం ఒక్క సభ్యుడే ఉన్నా ఆ సమస్యలోని తీవ్రత, పరిష్కారంలోని నిబద్ధతను అన్ని పార్టీలకూ తెలియచెప్పి ఒప్పించి చివరకు రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను సాధించటంలో జేపీ సఫలమయ్యారు. ప్రజాప్రయోజనాల కోసం పార్టీలన్నీ కలిసికట్టుగా వ్యవహరించేలా చేసి, భారత ప్రజాస్వామ్యం పరిపక్వతకు అద్దంపట్టేలా, పరిపుష్టతకు దారితీసేలా ఆయన ఆ ఫలితాన్ని సాధించారు. చివరకు పరిశ్రమలకు, పోర్టులకు,

**లోక్‌సత్తాకు సభలో కేవలం ఒక్క సభ్యుడే ఉన్నా ఆ సమస్యలోని తీవ్రత, పరిష్కారంలోని నిబద్ధతను అన్ని పార్టీలకూ తెలియచెప్పి ఒప్పించి చివరకు రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను సాధించటంలో జేపీ సఫలమయ్యారు. ప్రజాప్రయోజనాల కోసం పార్టీలన్నీ కలిసికట్టుగా వ్యవహరించేలా చేసి, భారత ప్రజాస్వామ్యం పరిపక్వతకు అద్దంపట్టేలా, పరిపుష్టతకు దారితీసేలా ఆయన ఆ ఫలితాన్ని సాధించారు.**

ఇతర అవసరాలకు కేటాయించిన భూముల్ని పునస్సమీక్షిస్తామని, అనవసరంగా కేటాయించినవాటిని, అక్రమంగా వినియోగిస్తున్నవాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని, ఎంతమేరకు, ఏ ప్రయోజనానికి ఎంత భూమిని కేటాయించాలో నిర్ధారించి ప్రజాప్రయోజనాలు నెరవేరేలా కేటాయించేందుకు రాష్ట్రంలో తొలిసారి కొత్త భూకేటాయింపు విధానం తెస్తామని ముఖ్యమంత్రి సభలో ప్రకటించటంతో సమస్యకు ఒక నిర్దిష్ట పరిష్కారం లభించింది.

## సంధించిన ప్రశ్నలు - హేతుబద్ధ వాదనలు

"కోస్తా తీరప్రాంతంలో 348 కి.మీను ఒకే గ్రూప్‌నకు గుత్తాధిపత్యంగా ధారాదత్తం ఎలా చేశారు అని నేను లేవనెత్తిన ప్రశ్నకు సంబంధిత మంత్రిగారి సమాధానం చాలా అమాయకంగా, ఏ రకమైనా ఇబ్బందీ లేదన్నట్టు, అది చాలా సాధారణ అంశమన్నట్టు ఉంది. కానీ ఈ అంశం అత్యంత గంభీరమైన విషయం.

ఖచ్చితంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి మద్దతు, ప్రోత్సాహం ఇవ్వాలి. అందునా మనరాష్ట్రంలోని వారి పట్ల మరింత సద్భావన, తోడ్పాటు ఇవ్వాలి. పెట్టుబడులు పెడితే లాభం వస్తుందనే విశ్వాసం కల్పించాలి. కానీ అదేసమయంలో సహజవనరుల కేటాయింపులో కొన్ని మౌలికమైన ప్రమాణాలు ఉండాలి. ఈ గాలిని, వెలుతురును, నీటిని, 2-జీ స్పెక్ట్రాన్ని, గనులను అధికారంలో ఉన్నవారు తమకు ఇష్టమొచ్చినట్టు అప్పనంగా ధారాదత్తం చేయటం సహించరానిది. ఆ అధికారం పాలకులకు ఎవ్వరూ ఇవ్వలేదు. 5,000 సంవత్సరాల చరిత్ర గల దేశం ఎటుపోయినా ఫర్వాలేదు, రాబోయే తరాలు ఏమైనా మాకనవసరం అన్నట్టు చేస్తే అది ప్రభుత్వం వ్యవహరించాల్సిన తీరు ఎంతమాత్రం కాదు. ప్రకృతి వనరులు ఏ ఒక్కరి సొత్తూ కాదని 'ది కాన్సెప్ట్ ఆఫ్ పబ్లిక్ ట్రస్ట్ డాక్ట్రిన్' ద్వారా సుప్రీంకోర్టు తన తీర్పుల్లో స్పష్టంగా పేర్కొంది. సముద్రతీరం ప్రకృతివనరు కాదని ప్రభుత్వాన్ని చెప్పమనండి. 974 కి.మీ ఉన్న కోస్తా తీరాన్ని 9,000 కి.మీ చేయగలమని చెప్పమనండి. వాస్తవాల్ని జాగ్రత్తగా విశ్లేషించి చూడాలి.

నా వద్ద ప్రపంచంలోని అతిపెద్ద ఓడరేవుల వివరాలు ఉన్నాయి. 515 మెట్రిక్‌టన్నుల కార్గోతో (సరకు రవాణా) సింగపూర్ ప్రపంచంలో అతిపెద్ద ఓడరేవుగా ఉంది. దాదాపు సింగపూర్‌తో పోటీపడుతూ చైనాలోని షాంఘై 508 మె.టన్నుల కార్గో, ఐరోపాలోని రోటర్ డ్యాం 421, చైనాలోని టియాంజెన్ 365, నింగోజైషాన్ 361, హ్యాంగ్జీ 347, చింగ్‌డా 278, హాంకాంగ్ 259, చిన్నువాంగ్డో 252 మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యం కలిగిన పెద్ద ఓడరేవులు. భారతదేశంలోని పోర్టులన్నీ కలిపి 560 మెట్రిక్ టన్నుల కార్గో కలిగి ఉంటే ఆ సామర్థ్యాన్ని దాదాపు ఒక్క సింగపూరే కలిగిఉందని అర్థమవుతుంది. ఒక్క చైనాలోనే కార్గో మనకంటే ఆరురెట్లు అంటే, 2,800 మెట్రిక్ టన్నులమేర ఉంది. మనం చైనాతో పోటీపడి 3,000-4,000 మెట్రిక్ టన్నుల కార్గోను అభివృద్ధి చేసుకునే ప్రయత్నం చేయాల్సిందిపోయి కొత్త ప్రాజెక్టులకు స్థలం ఇచ్చే పరిస్థితి లేకుండా రాష్ట్రంలో వందల కిలోమీటర్లు ధారాదత్తం చేశాం. బాపట్ల వద్ద ఎయిర్‌ఫోర్స్ కిచ్చే కొద్దిప్రాంతం, నదులు, డ్రెయిన్లు సముద్రంలో కలిసే కాస్త ప్రాంతం మినహాయించి, దక్షిణంలో నెల్లూరు జిల్లా తడ నుంచి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్ వరకూ 348 కి.మీ మేర చీమలు దూరకుండా, కాకులు ప్రవేశించకుండా పంచేశాం. మూడు పోర్టుల పేరుతో, మూడూ ఒకే కంపెనీకి పంచేశారు. దేశ చరిత్రలో ఎక్స్‌క్లూజివ్ జోన్ అనే కాన్సెప్టే ఇంతవరకూ లేదు. ఏ చట్టంకిందా లేదు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడిజాబితాలోని (కంకరెంట్) సబ్జెక్ట్. దేశంలో ఏ పోర్టుకీ చేయలేదు. కేంద్రప్రభుత్వం కింద ఉన్న పెద్ద పోర్టు విశాఖపట్నంసామర్థ్యం 65 మె.టన్నులు ఉంటే, వాటర్‌ఫ్రంట్ కేవలం 13-15 కి.మీ మాత్రమే ఇచ్చారు. మేజర్‌పోర్టు న్యూమంగళూరు పోర్టుకు 1.7 కి.మీ, కొచ్చిన్ ద్వీపం కాబట్టి 36 కి.మీ, బొంబాయి 13 కి.మీ, నవీ ముంబయి 14 కి.మీ, కాండ్లా 36 నుంచి కనిష్టంగా 1.7 కి.మీ మాత్రమే కేటాయించారు. తూర్పుతీరంలో కేంద్రం అధీనంలో ఉన్నవి బెంగాల్‌లోని హాల్దియా, కలకత్తా కూడా కలిపి మొత్తం 79 కి.మీ మాత్రమే వాటర్‌ఫ్రంట్‌ను కలిగి ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దక్షిణ తీరప్రాంతంలో ఏ స్థాయిలో, ఎంత వరకూ వస్తాయో కూడా తెలియని మూడు పోర్టులకు వాటర్‌ఫ్రంట్, ఎక్స్‌క్లూజివ్ జోన్ పేరుతో 348 కి.మీ ఇచ్చేసింది. చివరకు కేంద్ర ప్రభుత్వం పోర్టు-షిప్‌యార్డును పెడతామంటే స్థలం లేకుండా పోయింది. ఇదేదో కేంద్రం ప్రేమతో మనకు ఇస్తున్నది కూడా కాదు. మన ఆస్తుల్ని డిఫెన్స్‌కు అమ్మటం వల్ల వచ్చిన రూ.1000కోట్లతో ఇక్కడ పోర్టు-షిప్‌యార్డును ఇస్తామని కేంద్రం చెప్పింది. ఆ మేరకు ముఖ్యమంత్రి ఒక లేఖ కూడా రాశారు. అయితే రాచరికపు ధోరణితో పంపిణీ చేయటం వల్ల తీరంలో ఎక్కడా ఖాళీలేకుండా పోయింది.

ఈ నేపథ్యంలో 1. ఇంత కీలక నిర్ణయం విషయంలో కేంద్రప్రభుత్వ అనుమతి తీసుకున్నారా? 2. వాటర్‌ఫ్రంట్ కేటాయింపులో రాష్ట్రప్రభుత్వానికేమైనా కేంద్రం నుంచి నిబంధనలు ఉన్నాయా? ఉంటే వాటిని పాటించారా? 3. అసలు ఎక్కడన్నా దేశంలో ఈ పోర్టు కోసం వాటర్‌ఫ్రంట్‌కాకుండా ఎక్స్‌క్లూజివ్ జోన్‌గా నిజాంగారి ఫర్మానాలా రాసిచ్చేయటం ఉందా? 4. ఇవన్నీ కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా వచ్చిన ప్రైవేటు ప్రాజెక్టులు. వీటిని నాక్కావలసిన వాళ్లకు, తమ్ముడు, బావమ్మర్దికి ఇవ్వకూడదు. కాంపిటీటివ్ బిడ్డింగ్ చేస్తున్నప్పుడు ఆ బిడ్ డాక్యుమెంట్లలో ఈ రకమైన ఎక్స్‌క్లూజివ్ జోన్ ఉంటుందని నిర్దిష్టంగా ప్రకటన చేశారా? చేయకపోతే ఎవరిచ్చారు మీకా హక్కు? ఎం.వో.యూల ద్వారా మీ ఇష్టమొచ్చినట్టు ఎలా మారుస్తారు?

1996-97లో ఒక ఆర్డర్, 2004, 2007, 2009లో ఆర్డర్లు ఇచ్చారు. 2011లో మరో ఆర్డర్ ఇస్తారేమో. ముఖ్యమంత్రే చెబుతున్నారు ఇక ఏమీ ఎవరికీ కేటాయించటానికి మిగలలేదని. ఇక పార్టీలు వేరే అక్కర్లేదు. మీరు ఈ విషయంలో ఎం.వో.యూలను సవరించి ఏకపక్షంగా, ప్రజల అనుమతిలేకుండా, కేంద్ర ప్రభుత్వ అనుమతిలేకుండా, ప్రజాసంక్షేమం పాటించకుండా ఒప్పందం కుదుర్చుకున్నారు. గతంలో మీరే కుదుర్చుకున్న ఒప్పందం 6.2 పేరాలో ప్రజాసంక్షేమం కింద దీనికి నిర్దిష్ట మార్పులు ఇప్పటికైనా చేస్తారా? ఈవేళ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం, పరిశ్రమలకోసం, అందుకోసం పోటీవాతావరణాన్ని పెంపొందించటం కోసం, కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే ప్రాజెక్టు కోసం ఏకతాటి మీద పోరాడాల్సి ఉంది."

జేపీ ప్రశ్నలకు ఇతర పార్టీల నేతలు కూడా గొంతు కలిపారు. ఈ సమస్య మీద అండగా నిలిచారు.

తప్పించుకునే ధోరణిలో మంత్రిగారి పొంతనలేని సమాధానం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి సమాధానమిస్తూ... 1996లో నాట్కో ఫార్మా కంపెనీ కృష్ణపట్నం పోర్టును కేటాయించారని, 2003 దాకా ఏ విధమైన పనులూ చేపట్టలేదని, ఆ ఏడాది అనుమతించిన గంగవరం పోర్టు తరహాలో కేటాయింపులు చేయాలని రివైజ్డ్ ప్రపోజల్ పెట్టుకున్న నేపథ్యంలో అటు 20 కి.మీ, ఇటు 20 కి.మీ కేటాయింపు జరిగిందని, ఆ తర్వాత మళ్లీ ఆ కేటాయింపును పెంచటం జరిగిందని బైటపెట్టారు. పి.పి.పి నమూనాలో భారీ పెట్టుబడి పెట్టే సంస్థలకు ఎక్స్‌క్లూజివ్ జోన్లు ఇస్తుంటారని, జీఎంఆర్, జీవీకే సంస్థలకు అలాగే ఇచ్చారని, ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల 116 నాటికల్ మైళ్లు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. షిప్‌యార్డు-పోర్టు ప్రతిపాదన కేంద్రం నుంచి తమకు అందలేదని, నక్కపల్లి లేదా రామాయంపేటలో వారు సర్వే చేసుకుని తేల్చి చెబితే తాము స్థలం కేటాయిస్తామన్నారు. వాడరేవు పోర్టుతోపాటు నిజాంపట్నంకు వాన్‌పిక్ సంస్థకు 4,700 ఎకరాలు ప్రభుత్వ భూమి ఇచ్చేందుకు ఒప్పందం ఉన్నా కోర్టు కేసుల వల్ల ఇంకా కేటాయించలేదన్నారు. వారు మార్కెట్‌రేట్లకు రైతుల వద్దనుంచి 20,000 ఎకరాల వరకూ సేకరిస్తున్నారన్నారు. రసల్‌ఖైమా ప్రభుత్వంతోపాటు వారికి సంబంధించిన వారితో జీ టూ జీ ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోకి విదేశాల నుంచి బొగ్గును చౌకగా తెప్పించుకుని ఇక్కడ విద్యుత్‌ప్లాంట్లను అభివృద్ధి చేసుకుని విద్యుత్ కొరత లేకుండా చూసుకోవటానికి, ఇతర అంతర్జాతీయ వాణిజ్యానికి పోర్టులను అభివృద్ధి చేసుకునేలా ప్రభుత్వం పారదర్శక విధానాలతో కృషి చేస్తోందని మంత్రి సెలవిచ్చారు.



తప్పులు జరిగాయంటూనే కేంద్రప్రభుత్వం కోరితే స్థలమిస్తాం, పోర్టుల పనులు ముున్ముందు ముమ్మరంగా జరుగుతాయి, ప్రైవేటు సంస్థల ప్రయోజనాల పరిరక్షణకు కొన్ని ఎక్స్‌క్లూజివ్ కేటాయింపులు అవసరం, రసల్ ఖైమాతో ఏవేవో ఒప్పందాలు జరిగాయంటే పొంతన లేకుండా కప్పిపుచ్చుకునే రీతిలో మంత్రి మాట్లాడటంపై జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా స్పందించారు.

పోటీ బిడ్డింగ్ ఇచ్చాక మళ్లీ రకంగా మార్చారు? ఎవరిచ్చారు మీకా అధికారం?

మంత్రిగారు సభను పక్కదోవ పట్టిస్తున్నారు

పత్రాలు, ఎం.వో.యూలు సభ ముందు పెట్టండి: జేపీ

జేపీ మళ్లీ మాట్లాడుతూ... "ప్రైవేటు సంస్థల ప్రయోజనాలను హేతుబద్ధంగా కాపాడాలనటంలో ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన పన్లేదు. ఏ ప్రభుత్వమో నాకనవసరంగానీ ఒప్పందం చేసుకున్నప్పుడు రెండు పనులు చేశారు- ఒక సంస్థ భారీ పెట్టుబడులు పెట్టినప్పుడు చుట్టుపక్కల 10-20 కి.మీ లోపు పోటీ వస్తే ఇబ్బందికాబట్టి ఫస్ట్ రైట్ ఆఫ్ రెఫ్యూజల్ ఉండాల్సిందే. ప్రజాప్రయోజనాల కోసం, అంటే, భారత ప్రభుత్వం కావచ్చు, నేవీ కావచ్చు, మరో కీలకావసరం కావచ్చు, అందుకోసం స్థలాల్ని సేకరించి ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఏ రకంగా దీన్ని మార్చారు? ఎవరిచ్చారు మీకీ అధికారం? ఒకసారి కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా ఇచ్చాక ఎందుకు మార్చారు? వందల కిలోమీటర్ల తీరాన్ని ఎక్స్‌క్లూజివ్ జోన్ పేరుతో ఎలా ధారాదత్తం చేశారు? ప్రజాసంక్షేమం, పారదర్శకత అంటున్నారు ఎం.వో.యూని, ఫైళ్లను, ప్రభుత్వ విధానాలను పోర్టులవారీగా సభ ముందు పెట్టండి. రాష్ట్ర ప్రయోజనాల్ని, సహజ వనరుల్ని కాపాడాలని, పోటీని పెంచి పరిశ్రమలను సాధించాలని అన్నిపార్టీలవారూ కోరుకుంటున్నారు.

1. భారత ప్రభుత్వం నుంచి మీకేమైనా నిర్దిష్టంగా గుత్తాధిపత్యం ఇవ్వకండి, ఇస్తే ఒక జెట్టీ ఇవ్వండి అని సూచనలు ఏవైనా వచ్చాయా?...

అలాంటి సూచనలు అందలేదని మంత్రి చెబుతున్నారు. కానీ ఒక బటన్ స్విచ్ నొక్కితే నాకు ఆ సమాచారం వచ్చింది. కేంద్రం విదేశాల్లో ఉంది, మాకు ఈ-మెయిళ్లు రావు, ఢిల్లీకి ఫోన్ చేయటానికి పదిహేను రోజులు పడుతుంది అన్నట్టు మంత్రి మాట్లాడుతున్నారు. ఇది సభను పక్కదోవ పట్టించటమే.

2. ఆస్తిహక్కు ప్రాథమిక హక్కు కాదు. ఈదేశంలో మీ సొంత ఆస్తి, తరతరాలుగా వస్తున్న ఆస్తిని కూడా సేకరించే హక్కు ప్రభుత్వానికి ఉంది. మనమిచ్చిన హక్కు ఇది. ఒక గనులు కావచ్చు, 2-జీ స్పెక్ట్రం కావచ్చు, తీరప్రాంతం కావచ్చు,

మనమిచ్చిన హక్కును మనమే తీసుకోవచ్చు. అందుకోసం గతంలో మీరు చేసిన ఎం.వో.యూ ప్రకారమే కేటాయింపుల్ని రద్దు చేయవచ్చు.

3. మంత్రిగారు నక్కపల్లి ప్రస్తావన తెచ్చారు. దేశంలో లక్షద్వీప్, అండమాన్ కాకుండా ఏడు తీరప్రాంత రాష్ట్రాల్లో మొత్తం 12 ప్రధాన పోర్టులు ఉంటే విశాఖపట్నం ఒక్క జిల్లాలోనే 2 పోర్టులు పెట్టమనటం ఎంత అనౌచిత్యం? రామాయంపేటలో ఎక్స్‌క్లూజివ్ హక్కుల్ని కేటాయించేశారు ఇంకెక్కడినుంచి ఇస్తారు? కేంద్రప్రభుత్వం అడిగితే ఇస్తామంటున్నారు... భారత ప్రభుత్వాన్ని బిచ్చగాళ్లను చేస్తున్నారా? అది ఉమ్మడి జాబితాలో అంశమై ఉండి, పదేళ్ల క్రితం వరకూ మాకో పోర్టు పెట్టండని అడుక్కునే స్థితిలో ఉండి, ఈవేళ భారత ప్రభుత్వం అడిగితే పోర్టు పెడతామనటం విచిత్రంగా ఉంది. ఇక్కడ పెట్టండి అని కోరి మనం తెచ్చుకోవాల్సింది పోయి వారడిగితే మేమిస్తామనటం ఎంత నిర్లక్ష్యం ఈ రాష్ట్ర, దేశ ప్రయోజనాల గురించి? జాతీయ ప్రయోజనాల గురించి?

భూమిని మనం ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి చేసేది కాదు. అగిపెట్టెల్ని, పెన్నుల్ని, కాగితాల్ని తయారుచేసినట్టు భూమిని తయారుచేయలేం. భూమి శాశ్వత వనరు. తీరప్రాంతంలో వందలాది కిలోమీటర్లు ఒకరి చేతిలో పెట్టేసి మళ్లీ ప్రాజెక్టు కావాలంటే వారి దగ్గరకు వెళ్తున్నాం. ప్రభుత్వం వద్ద ల్యాండ్‌బ్యాంకుగా భూమి ఉండాలి. ప్రభుత్వం వద్ద భూమిని ఉంచుకుని ఏ ప్రాజెక్టుకు అవసరమైతే ప్రజాహితం దృష్ట్యా దాన్ని చేపట్టగలిగే పరిస్థితి ఉండాలి.

515 కార్గో సామర్థ్యంతో ప్రపంచంలో అతిపెద్ద ఓడరేవు సింగపూర్‌కు కేటాయించింది కేవలం 480 హెక్టార్లు, అంటే 1200 ఎకరాలు. ఆంధ్రప్రదేశ్‌లో కంటే 51రెట్లు ఎక్కువ సామర్థ్యం ఉన్న సింగపూర్‌కు అంతకేటాయింపే చేస్తే మన రాష్ట్రంలో మాత్రం 25,000, 30,000 ఎకరాలు కేటాయించేశారు. పక్కన విద్యుత్ ప్రాజెక్టు పెట్టాలంటే పచ్చని పంటపొలాల్ని లాక్కుంటున్నారు, ఫైరింగుల్ని తీసుకొస్తున్నారు. ప్రకాశం జిల్లా కనపర్తిలో పక్కనే వాన్‌పిక్ భూమి ఉంటే వదిలేసి రెండు పంటల సాగుభూమిని లాక్కుంటూ రైతుల్ని రోడ్డెక్కిస్తున్నారు.

ఖచ్చితంగా మనం ప్రైవేటు ప్రాజెక్టుల్ని ప్రోత్సహించాలి. వారికి హేతుబద్ధమైన ప్రోత్సాహకాల్ని అందించాలి. లాభాలు వస్తాయన్న నమ్మకం కలిగించాలి. కానీ ఆ పేరుతో జాతి సహజవనరుల్ని ధారాదత్తం చేసే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదు. అది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. ఇది మంత్రిగారి పరిధికి మించిన విషయం కాబట్టి ముఖ్యమంత్రి స్పందించాలి. జీ 2 జీ రసాల్‌ఖైమాతో ఒప్పదం ఆ దేశ విదేశాంగమంత్రితో చేసుకున్నారా, రాయబారితో చేసుకున్నారా? ఎవరి సంతకం ఉంది అందులో? ఏమాత్రం పోటీ బిడ్డింగ్ లేకుండా వోక్స్‌వ్యాగన్‌లాగా చేసుకున్న ఒప్పందమది. దీన్ని కూడా ముఖ్యమంత్రి సమీక్షించాలి.

ఇక ముందు సభను పక్కదోవ పట్టించే వీలులేకుండా ఎం.వో.యూలు, ఇతర పత్రాలను సభ ముందు పెట్టాలి" అని జేపీ డిమాండ్ చేశారు.

## భూ కేటాయింపులపై స్పష్టమైన కొత్త విధానం తెస్తాం సమీక్షించి అవసరమైతే భూముల్ని వెనక్కి తీసుకుంటాం : ముఖ్యమంత్రి

జేపీ మాట్లాడిన తర్వాత ముఖ్యమంత్రి కె. కిరణ్ కుమార్ మాట్లాడుతూ... పరిశ్రమలు, ఓడరేవులు, ఇతర ముఖ్య అవసరాలకు భూములను కేటాయించటంపై రాష్ట్రప్రభుత్వం త్వరలో ఒక స్పష్టమైన కొత్త విధానాన్ని ప్రకటించనుందని తెలిపారు. ఆయా పరిశ్రమల అవసరాలకు ఎంత భూమి కావాలి? ఎంత కేటాయించాలి? వంటి వివరాలన్నీ అందులో ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ ఆస్తిని ధారాదత్తం చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని స్పష్టంచేశారు. గతంలో జరిగిన కేటాయింపులన్నిటినీ సమీక్షించి ఒకవేళ భూములను వెనక్కి తీసుకోవాల్సి వస్తే తీసుకుంటామని తెలిపారు. పరిశ్రమలు అవసరమేనని, అదే సమయంలో మత్స్యకారుల జీవనాధారం దెబ్బతినకుండా చూడాల్సి ఉందన్నారు. రొయ్యల వ్యాపారం మీదే రాష్ట్రానికి రూ. 11,000కోట్ల ఆదాయం వస్తోందన్నారు. నిపుణులతో ఒక కమిటీని వేసి వారి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకున్న తర్వాత త్వరలోనే ప్రభుత్వం ఒక నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ఇందుకోసం కేంద్రం సాయాన్ని కూడా అవసరమైతే తీసుకుంటామన్నారు. భూముల అప్పగింతపై 1996 నుంచి 2009 వరకు ఒప్పందాలు జరిగాయని, వాటన్నింటినీ సమీక్షించి రాష్ట్రప్రయోజనాలు కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భారత ప్రభుత్వం నుంచి మరో ఓడరేవు ఏర్పాటుకు స్థలాన్ని ఇస్తామని స్పష్టంగా ప్రకటించారు. ■

# సీవీసీ నియామకంపై సుప్రీంకోర్టు తీర్పు

## కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు

**- జయప్రకాష్ నారాయణ్**

**కేంద్ర విజిలెన్స్ కమీషనర్ నియామకం చెల్లదని, అది చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుపై డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన వాఖ్యలను ఇస్తున్నాం**

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పి.జె థామస్‌ను నియమించటం చెల్లదని, అది చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పు కేంద్రప్రభుత్వానికి, ప్రధానికి, హోంమంత్రికి చెంపపెట్టని, ఆ తీర్పును లోక్‌సత్తా పార్టీ మనసారా ఆహ్వానిస్తోందని పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో తప్పులు జరిగినప్పుడు శాంతియుతంగా, హుందాగా, అవసరమైన చోట న్యాయవ్యవస్థ జోక్యంతో ఎలా పరిష్కరించుకోవచ్చో ఈ తీర్పు రుజువు చేసిందన్నారు. సీవీసీ తొలగింపునకు పిటిషన్ దాఖలు చేసిన జె.ఎం లింగ్డో, సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్‌ను జేపీ అభినందించారు.

కేరళలో పామోలిన్ దిగుమతి కుంభకోణం కేసులో థామస్ నిందితుడిగా ఉన్న విషయాన్ని అలావుంచితే... స్వతంత్ర భారత చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా పేరుమోసిన 2-జీ స్పెక్ట్రం కుంభకోణాన్ని సీబీఐ విచారించకూడదని, ఆ కుంభకోణం వెలుగులోకి రాకూడదని టెలికాం శాఖలో ఉన్నత పదవిలో ఉండి అడ్డుపడ్డ వ్యక్తి కాబట్టి థామస్‌ను సీవీసీగా నియమించకూడదని లోక్‌సత్తా తొలినుంచీ గట్టిగా వ్యతిరేకిస్తోందని అన్నారు. ప్రధాని, హోంమంత్రి, ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉన్న కమిటీలో విపక్ష నేత సుష్మా స్వరాజ్ ఈ అభ్యంతరాల్ని విస్పష్టంగా లేవనెత్తినా పట్టించుకోలేదన్నారు. ప్రతిపక్ష నేతే కాకుండా ఒక సాధారణ పౌరుడు బలమైన వాదన లేవనెత్తితే పట్టించుకోవాల్సిన ప్రధాని అవేవీ ఆలోచించకుండా ఒక భారీ కుంభకోణం విచారణను అడ్డుకున్న వ్యక్తిని... అవినీతిని అంతం చేయాలనుకునే అత్యున్నత స్థాయి సంస్థకు నియమించారన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఉన్నప్పుడు అప్పటి సంతానం కమిటీ సిఫార్సుల మేరకు మూడునెలల్లో కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఏర్పాటు చేశారని, 2003లో దానికి చట్టబద్ధత వచ్చాక ఆ చట్టాన్ని బలోపేతం చేయకుండా బలహీన పరిచేలా పాలకులు వ్యవహరించారని ధ్వజమెత్తారు. క్షమార్హంకాని ఈ ఉదాసీనతకు అడ్డుకట్ట వేసి రాజ్యాంగసంస్థలతోపాటు మరే ఇతర సంస్థల్లోనూ నియామకాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిక చేసేలా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఇలాంటి కీలక నియామకాల్లో ఎలాంటి ప్రమాణాల వ్యక్తుల్ని నియమించాలో ఇక మీదట న్యాయసమీక్ష పరిధిలోకి వెళ్లటం కూడా మరో స్వాగతించదగ్గ అంశమన్నారు.

2-జీపైనా భంగపడకముందే లైసెన్సుల్ని రద్దుచేయండి ప్రధానమంత్రి గారూ

లోక్‌సత్తా... జె.ఎం లింగ్డో, సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్, పౌరసమాజ ప్రముఖులతో కలిసి అవినీతిమయమైన 2-జీ స్పెక్ట్రం లైసెన్సుల్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిందని, సీవీసీ నియామకం లాగే ఆ లైసెన్సులు రద్దవుతాయని తమకు పూర్తి విశ్వాసముందని జేపీ అన్నారు. లైసెన్సుల రద్దు కోరుతూ ప్రధానికి, ఎంపీలకు తాము లేఖలు రాశామని, వేలాదిగా పోస్టాఫీసుల నుంచి లోక్‌సత్తా కార్యకర్తలు కార్డులు, ఎం.వోలు పంపారని, సుప్రీంకోర్టు చెంపదెబ్బ కొట్టకముందే ప్రధాని మేలుకుని ఆ లైసెన్సుల్ని రద్దు చేయాలని అన్నారు. లైసెన్సుల్ని రద్దు చేసి వేలం పాటల్ని పెట్టటంతోపాటు విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ ట్యాక్స్ వేసి అప్పనంగా వచ్చిన లాభాల్ని ప్రభుత్వ ఖజానాకు జమచేయాలని డిమాండ్ చేశారు. ప్రతిదానికీ రాజ్యాంగసంస్థల మీద ఆధారపడటం వాంఛనీయం కాదనే 2-జీ స్పెక్ట్రం లైసెన్సుల రద్దు విషయంలో ప్రధాని మేలుకోవాలని కోరుతున్నామని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ■

**దేశాన్ని అభిమానించేవాళ్లు మాత్రమే దేశాన్ని అభివృద్ధి చేయగలరు** - మహాత్మాగాంధీ

# అమెరికాలో 'దండియాత్ర-2'

## అవినీతి రహిత భారతదేశం కోసం ఎన్నారైల ఉద్యమం



'అవినీతిరహిత భారతదేశాన్ని నిర్మించాలి' అనే సందేశంతో అమెరికాలో ఎన్నారైల దండియాత్ర-2 ప్రారంభమైంది. బ్రిటీషు పాలకులకు వ్యతిరేకంగా 80ఏళ్ల క్రితం 1930లో మహాత్మాగాంధీ దండియాత్ర చేపట్టిన మార్చి 12నే దండియాత్ర-2ను ప్రారంభించటం జాతి నిర్మాణం, అహింసా యుత పోరాట మార్గం పట్ల ప్రవాస భారతీయుల నిబద్ధతను తెలియచేస్తోంది. అహ్మదాబాద్ సమీపంలోని సబర్మతీ ఆశ్రమం నుంచి దండి గ్రామం వరకూ 240 మైళ్ల మేర గాంధీజీ చేసిన యాత్ర సత్యాగ్రహ ఉద్యమంగా మారి భారతదేశ చరిత్రనే మార్చివేసింది. దండియాత్ర-2కు ప్రధాన బాధ్యతలు తీసుకున్న ప్రవాస భారతీయుల ప్రజాసంఘం 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' కృషి అభినందనీయం.

అమెరికా శాన్‌డీగో లోని మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ మెమోరియల్ పార్క్ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోలోని గాంధీ విగ్రహం వరకూ 15రోజులపాటు 35 నగరాల్లో 240 మైళ్ల మేర జరిగే ఈ యాత్రకు మద్దతుగా ముగింపురోజున అమెరికాలోని పన్నెండు రాష్ట్రాల్లో, కెనడా, దుబాయ్, జర్మనీ, బ్రిటన్, మలేషియా, సింగపూర్, స్విట్జర్లాండ్ దేశాల్లో, హైదరాబాద్ సహా భారత్‌లోని పన్నెండు నగరాలలో సంఘీభావ యాత్రలు జరగనున్నాయి.

భారతదేశంలో అవినీతి నియంత్రణకు జన లోక్‌పాల్ చట్టాన్ని తీసుకు రావాలని, విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న దాదాపు 22 లక్షల కోట్ల రూపాయల నల్లధనాన్ని రప్పించేందుకు ఐక్యరాజ్యసమితి చేసిన అవినీతి వ్యతిరేక తీర్మానాన్ని ఉపయోగించాలని ఎన్నారైలు డిమాండ్ చేస్తున్నారు. "ఇటీవల బైటపడిన 2-జీ స్కాం వంటివి స్వతంత్ర భారతచరిత్రలోనే కనీవినీ ఎరుగనటువంటివి. అవినీతికి వ్యతిరేకంగా ఇటీవల భారతదేశమంతా కదలటం చాలా శుభపరిణామం. ఎన్నారైలు చేస్తున్న దండియాత్ర-2 భారతదేశంలోని అవినీతి వ్యతిరేక ఉద్యమాలకు ఊపునిచ్చేందుకు చేస్తున్న ఒక ప్రయత్నమే" అని వారు పేర్కొన్నారు.

### అందరూ పాల్గొనాలి: లోక్‌సత్తా పార్టీ

ప్రవాసుల దండియాత్ర-2కు లోక్‌సత్తా పార్టీ సంఘీభావం ప్రకటించింది. ప్రజాస్వామ్యాన్ని ఆవిష్కరించటంలో ఓ కీలక ఘట్టంగా నిలిచిపోతుందని పేర్కొంది. కులం, మతం, ప్రాంతం, భాష తేడాలేకుండా ఆయా దేశాల్లో ఎన్నారైలు ఇందులో పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది. భారతదేశం నుంచి భారతీయులను వేరు చేయవచ్చు, కానీ భారతీయుల నుంచి భారతదేశాన్ని వేరు చేయలేమని, ఈవేళ మనం సరైన దిశగా వ్యవహరించగలిగితేనే 2039నాటికి భారత్‌ను అగ్రరాజ్యంగా తీర్చిదిద్దుకోగలుగుతామని గుర్తుచేసింది.

ఇందుకు ఇండియా ఎగనెస్ట్ కరప్షన్, ది ఫిఫ్త్ పిల్లర్ (చెన్నై), యూత్ ఫర్ బెటర్ ఇండియా (హైదరాబాద్), సాకు (బెంగళూరు), సేవ్ ఇండియా ఫ్రం కరప్షన్, జాగో, భారత్ స్వాభిమాన్, ఓరుమా, నాటా, తానా తదితర సంస్థలు కూడా తమ తోడ్పాటును అందిస్తున్నాయి. ■

# ప్రజాస్వామ్య పాలన కోసం అరబ్బు దేశాలలో ప్రజాపోరాటాలు

**- డి. సోమసుందర్**

ఓ పాతికేళ్ళ కుర్రాడిని పోలీసు కానిస్టేబుల్ కొట్టిన చెంపదెబ్బ అరబ్ దేశాలలో రాజకీయ భూకంపాలనీ, సునామీలనీ సృష్టిస్తోంది. ట్యునీషియాలో జరిగిన చిన్న సంఘటనతో చెలరేగిన నిరసన జ్వాలలు అరబ్ దేశాలనన్నిటినీ దావానలంలా చుట్టుముడుతున్నాయి. నియంతృత్వానికీ, అవినీతికీ, దుష్పరిపాలనకూ వ్యతిరేకంగా కొనసాగుతున్న ఉద్యమాలు పెత్తందారీ పాలక వర్గాల అధికార పీఠాల్ని కూలద్రోస్తున్నాయి. అరబ్ లీగ్‌లోని ఇరవైరెండు దేశాలలో ఎక్కడ చూసినా ప్రజల తిరుగుబాట్లు వెల్లువెత్తుతున్నాయి. పతనమైన నియంతల స్థానంలో ప్రజాస్వామ్యం పాదుకునే వరకూ అరాచకం, రక్తపాతం, కష్టాలు, కన్నీళ్ళు తప్పేటట్లు లేదు.

మహమ్మద్ బౌజీజీ పాతికేళ్ళ కుర్రాడు రోడ్డుపక్కన కూరగాయలు అమ్ముకునే చిరువ్యాపారి. తల్లినీ, ఆరుగురు అన్నదమ్ముల్నీ, అక్కచెల్లెళ్ళనీ పోషించాల్సింది అతనే, ట్యునీషియా రాజధాని ట్యునిస్ అతని నివాసం. అప్పటికే ఆర్థిక బాధలతో నానా అవస్థలు పడుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్నాడు. అతన్ని ఒక మహిళా కానిస్టేబుల్ చెంపచెళ్ళుమనిపించింది. నలుగురిలో జరిగిన అవమానంతో మానసికంగా క్రుంగిపోయాడు. పోలీసు దౌర్జన్యానికి నిరసనగా బౌజీజీ తన శరీరానికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో ట్యునీస్‌లో చెలరేగిన నిరసనలు దేశమంతటకీ విస్తరించాయి. ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్నది. చివరికి దేశాధ్యక్షుడు జినెదిన్ బెన్ అలీ కుటుంబంతో సహా దేశాన్ని వదిలి పరారవ్వాల్సి వచ్చింది. ట్యునీషియాలో ప్రజల తిరుగుబాటు పరిసరదేశాల ప్రజలకు ఓ దారి చూపింది. అనేక దేశాలలో నిరసన ప్రదర్శనలు మొదలయ్యాయి.

ఈజిప్టులో ప్రజాందోళనలు విజృంభించాయి. రాజధాని కైరో నగరంలోని తెహ్రీర్‌స్క్వేర్‌లో జనవరి25న కొన్ని వేలమంది ప్రజలు ప్రదర్శనలు చేసారు. ముప్పై సంవత్సరాలుగా ఈజిప్టుపై పెత్తనం సాగిస్తున్న హుస్నీముబారక్ చాలా నాటకాలు ఆడాడు. నిరసనలను అణచడానికి సామ, దాన, భేద, దండోపాయాలనన్నిటినీ ప్రయోగించాడు. అధ్యక్షుని అనుచరులు ప్రదర్శకులపై దాడికి దిగారు. ఫిబ్రవరి 1వ తేదీనాటికి ప్రదర్శకుల సంఖ్య లక్షలకు చేరుకుంది. సైన్యం సైతం ప్రజలపై కాల్పులు జరపడానికి నిరాకరించింది. గత్యంతరం లేక హుస్నీముబారక్ పలాయనం చిత్తగించాల్సి వచ్చింది. ప్రజల స్థిర సంకల్పం ముందు నియంతృత్వం తలవొంచాల్సి వచ్చింది.

బహ్రయిన్, ఎమెన్, ఒమన్, జోర్డాన్, లిబియా, కువాయిట్, మొరాకో సహ అనేక దేశాలలో నిరసనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. హుస్నీముబారక్ పలాయనం తర్వాత ఆ వరుసలో బహ్రయిన్ ప్రధానమంత్రి షేక్‌ఖలీఫా, ఎమెన్ అధ్యక్షుడు అలీఅబ్దుల్లా సలే వంటివారు కనిపిస్తున్నారు. ప్రజాగ్రహాన్ని చల్లబరచడానికి దేశాధినేతలు చేయని ప్రయత్నాలు లేవు. రానున్న ఎన్నికలలో తాము పోటీ చేయబోమని జోర్డాన్ ప్రస్తుత పాలకులు ప్రజలకు హామీ ఇచ్చారు. బ్యాంకు ఖాతావున్న ప్రతిఒక్కరికీ వెయ్యిదీనార్లను బోనస్‌గా ఆయా ఖాతాలకు జమ చెయ్యాలని కువాయిట్ అమీర్ నిర్ణయించాడు. సౌదీ అరేబియా రాజు అబ్దుల్లా దేశంలో ప్రభుత్వోద్యోగుల వేతనాలను, విద్యార్థుల స్కాలర్‌షిప్పులను అమాంతంగా పెంచేసాడు. ఇందుకోసం 37 బిలియన్ అమెరికన్ డాలర్ల సొమ్మును విడుదల చేసాడు. పలు గల్ఫ్ దేశాల పాలకులు తమ పౌరులకిచ్చే చమురు, ఇంధనం సబ్సిడీలను గణనీయంగా పెంచారు. లక్షమందికి కొత్తగా ఉద్యోగాలు ఇస్తామంటూ ట్యునీషియా పాలకులు హామీ ఇచ్చారు. లిబియా అధినేత గడాఫీ మరో అడుగు ముందుకు వేసాడు. తనను ప్రశంసిస్తూ పంపించే ఒక్కో ఎస్సెమ్మెస్‌కు వందలిబియన్ దీనార్ల రీఛార్జింగ్‌ను జమచేస్తానంటూ ప్రకటించాడు. అయినా పాలకుల ఎత్తులు పారడం లేదు. నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. దశాబ్దాల తరబడి అధికార పీఠాలపై తిష్టవేసుకున్న నియంతల పతనం తప్పదు. అయితే ఆ తర్వాత ఆయా దేశాలలో ప్రజాస్వామ్యం ఏ మేరకు నిలదొక్కుకుంటుందో

అనుమానాస్పదంగానే వుంది. నిజానికి అరబ్ లీగ్‌లోని 22 దేశాలలో మూడు దేశాలు మాత్రమే ప్రజాస్వామిక దేశాలుగా చెప్పుకోవచ్చు. వాటి ప్రజాస్వామ్యంలో కూడా చాలా లోపాలున్నాయనేది వేరే విషయం.

ఇరాక్ రక్తపాతం కొనసాగుతున్నప్పటికీ అక్కడ ఏక పార్టీ పాలన అంతమైంది. అయితే వివిధ తెగలమధ్య ఏకాభిప్రాయం ఏర్పడక పోవడం, ప్రమాణాలు కలిగిన ప్రజాస్వామ్య వ్యవస్థలు రూపొందక పోవడం ఇరాక్‌కు సమస్యలుగా వున్నాయి. లెబనాన్‌లో బాహాటత, బహుళత్వం కలిగిన సమాజం వున్నప్పటికీ, అది వివిధ తెగల మధ్య చీలిపోయి వుంది. కొన్ని శక్తివంతమైన కుటుంబాల ఫ్యూడల్ పెత్తనం అక్కడ కొనసాగుతోంది. పాలస్తీనాలో 2006లో ఎన్నికలు జరిగాయి. కానీ గెలిచిన రాజకీయ పార్టీకి పూర్తి పట్టు చిక్కలేదు. విభజితమైవున్న వివిధ భూభాగాలపై ప్రస్తుతం పట్టుకలిగిన శక్తులు తమ అధికారాన్ని విడిచి పెట్టడం లేదు.

ఇక మిగిలిన అరబ్ దేశాలలో ఏదో ఒక రూపంలో ప్రాతినిధ్య శాసన సభలు వున్నాయి. కాని అక్కడ ప్రజాస్వామ్యం దాని అసలైన అర్థంలో అమలులో లేదు. బహ్రెయిన్, ఈజిప్టు, జోర్డాన్, వంటిదేశాలలో గత సంవత్సరం ఎన్నికలు జరిగాయి. కానీ వీటివల్ల వచ్చిన ప్రజాస్వామ్య మార్పులేమీ లేవు. ఈజిప్టులో జరిగిన ఎన్నికల్లో అధికార నేషనల్ డెమోక్రటిక్ పార్టీ తన పార్లమెంటరీ మెజారిటీని 75శాతం నుంచి 95శాతానికి పెంచుకున్నది. ఈజిప్టులో ఓటు విలువ 20 పౌండ్ల నుంచి కొన్ని వందల పౌండ్లకు పెరగడం ఒక్కటే అక్కడి ప్రజాస్వామ్యంలో కనిపించే పురోగతి అంటూ అల్ అక్బర్ అనే లెబనాన్ పత్రిక వ్యాఖ్యానించింది. ఎన్నికలు జరిగి ఏడాది గడవక ముందే అక్కడి ప్రభుత్వం పతనమయ్యింది. అల్జీరియా, కువాయట్, లెబనాన్, మొరాకో, ట్యునీషియా, ఎమెన్ వంటి దేశాలు ఎంత భిన్నమైనవో వాటి ఎన్నికలు కూడా అంతే విభిన్నమైనవి. ఎన్నికలు ఎంత విభిన్నంగా వున్నప్పటికీ వాటి ఫలితం మాత్రం అన్ని దేశాలలోనూ ఒక్కటిగానే వుంది. ఏ దేశంలోనూ ప్రజాస్వామ్య ప్రక్రియ పటిష్టం కాలేదు. ఎవరో ఒక బలమైన వ్యక్తి అధికారాన్ని హస్తగతం చేసుకుని, దాన్ని శాశ్వతంగా సొంతం చేసుకోవడమే కనిపిస్తోంది. ఇటువంటి నియంతలకు వ్యతిరేకంగా కొన్ని శక్తులు తలెత్తినా కాల క్రమంలో నిరుత్సాహానికి గురై సద్దుమణిగిపోవడమో, తీవ్రవాద శక్తులుగా రూపాంతరం చెందడమో జరుగుతూ వస్తోంది. ఈ దేశాలన్నీ ప్రజాస్వామ్యాన్ని అమలు చేస్తున్నామంటూ చెపుతుంటాయి. కానీ అక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థ లేమీ సవ్యంగా వుండవు. అయితే సౌదీ అరేబియా ఆ మాత్రపు నటన కూడా చేయడం లేదు.

మొరాకో తన దేశంలో చర్చకు గల అవకాశాలను విస్తరించింది. కువాయట్‌లో ఎన్నికైన పార్లమెంటు వున్నప్పటికీ, పాలక్‌రాజ కుటుంబానిదే పూర్తి అధికారం. రాచరికం కొనసాగుతున్న చిన్న చిన్న గల్ఫ్ దేశాలలో ప్రజలకు ఏవేవో హక్కులు కల్పిస్తున్నట్లు కన్పించినప్పటికీ, ప్రజాస్వామ్య ప్రక్రియలను మాత్రం రాజులు నిరోధిస్తూనే వున్నారు. ప్రజలకు నిజమైన ఎంపిక అధికారం ఇస్తే ఏదో ఒక రోజు తమను కూలదోస్తారన్న భయం వారిలో వుంది. రాచరికాల పేరుతో వున్నా, రిపబ్లిక్‌ల పేరుతోవున్నా అరబ్ దేశాలన్నిటా కొనసాగుతున్నది నియంతృత్వమే!

అరబ్ దేశాలలో ప్రజాస్వామ్యపు లోటుకు గల కారణాలు గురించిన చర్చ చాలా వుంది. ఇస్లామును ఒక కారణంగా భావించేవారున్నారు. మానవ పరిపాలన కంటే దైవపాలన గొప్పదని భావించే సలాఫీ వాదం వల్ల ప్రజాస్వామ్యం పనికిరానిదన్న భావన కొన్ని వర్గాలలో వున్నది టర్కీ, ఇండోనేషియా, మలేసియా వంటి అరబ్బీయేతర ముస్లిము దేశాలలో ప్రజాస్వామ్యం ఎంతో కొంత మెరుగ్గా వుందన్న సంగతి గమనించాలి. మతానికి, రాజ్యానికీ మధ్య ఉండాల్సిన సంబంధాల విషయంలో ఎంతో అనిశ్చితి కొనసాగుతోంది. ఈ అనిశ్చితి ఫలితంగానే ప్రజాస్వామిక చర్చకు ఆస్కారం ఎంత వరకూ ఇవ్వొచ్చన్న అంశంపై భిన్నాభిప్రాయాలున్నాయి.

అరబ్బు దేశాలలోని తెగలు, పితృస్వామిక భావజాల ఆధిపత్యం కల్గిన సమాజాల కారణంగా ప్రజాస్వామ్యం వేళ్ళూను కోవడం కష్టంగా వుంది. వివిధ తెగల మధ్య వున్న విభజన జాతీయ సమాజం రూపొందడానికి ఆటంకంగా వున్నది. లిబియాలో గడాఫీకి గల మద్దతు తన తెగల నుంచి లభిస్తున్నదని గమనించాలి. ప్రభుత్వసైన్యంతో పాటు గడాఫీతన సొంత మిలీషియాను సమాంతరంగా నిర్వహిస్తున్నారు. అలాగే అరబ్‌దేశాలలో నిజమైన అధికారం ముల్లాల చేతిలోనూ, తెగల పెద్దల చేతిలోనూ వుంది. కొన్ని దేశాలలో సైన్యం శక్తివంతంగా రూపొందడంతో రాజ్యం పై సైనికాధికారుల ప్రభావం ఎక్కువగా వుంటోంది.

భౌగోళిక రాజకీయాల ప్రభావం కూడా ఒక అంశంగా గుర్తించాలి. కొన్ని అరబ్ దేశాలను యూరోపియన్ సామ్రాజ్యవాదులు కృత్రిమంగా సృష్టించారు. ఆయా దేశాలు తమ రాజ్య నిర్మాణంపై దృష్టిపెట్టినంతగా ప్రజాభాగస్వామ్యంపై పెట్టలేదు. ఇజ్రాయెల్‌పై సాగుతున్న యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ అరబ్ పాలకులు తమ సొంతదేశాలల్లో నియంతృత్వాన్ని చెలాయించు కుంటున్నారు. పశ్చిమ దేశాలు స్థిరత్వం పేరుతో అరబ్ దేశాల నియంతల్ని చూసీ చూడనట్లు వదిలేస్తున్నాయి. ఇజ్రాయెల్‌తో యుద్ధానికి మతం తోడుండటంతో చాలా దేశాలలో తీవ్రవాద శక్తులు పుట్టుకొచ్చాయి. పాశ్చాత్యదేశాలపై తీవ్రవాదులు సాగిస్తున్న దాడి, దానికి ప్రతిగా సాగుతున్న దండయాత్రలు అరబ్‌సమాజంలో ప్రజాస్వామ్య ప్రక్రియను నిర్వీర్యం చేస్తున్నాయి. తీవ్రవాద శక్తుల ప్రాబల్యం కలిగిన రాజ్యాన్ని గానీ, ఇస్లామిక్ ప్రజాస్వామ్యాన్ని గానీ చాలా మంది ప్రజలు కోరుకోవడం లేదు. వాటి బదులు ఎంతో కొంత స్థిరత్వాన్నిస్తున్న నియంతృత్వమే మేలని 40 నుంచి 45 శాతం ప్రజలు భావిస్తున్నట్లు ఒక అధ్యయనం వెల్లడించింది. వివిధ దేశాలలో తలెత్తున్న ముస్లిమ్ సహోదర బృందాల గురించిన భయాందోళనలు ఉదారవాద వర్గాలలో ఎక్కువగానే వుంది.

చమురు నుంచి వచ్చిపడుతున్న ఆదాయం కూడా అరబ్ దేశాలలో ప్రజాస్వామ్య ప్రక్రియకు అవరోధంగా వుందన్నది ఒక భావన. రాజ్యనిర్వహణకూ పరిపాలనకూ ప్రజలపై పన్నులు వెయ్యకుండా చమురు నిల్వలపై ఆధారపడుతున్న దేశాలలో ప్రజాస్వామ్యం పాదుకోవడం చాలాకష్టం నిరంతరాయంగా ప్రవహిస్తున్న చమురు ఆదాయానికి విదేశీ సహాయం కూడా తోడవుతోంది. అంగోలా, రష్యా, వెనిజులా వంటి అరబ్బీయేతర రాజ్యాలు కూడా చమురుపై ఆధారపడి వున్న సంగతి తెలిసినదే. ఈ రాజ్యాలలో సైతం బలమైన వ్యక్తుల పరిపాలనకు అనువైన వాతావరణం వున్నది. తమ ప్రజలతో బేరసారాలు చేయనవసరం లేకుండా ఈ పాలకులకు చమురు నిధులు వినియోగపడుతున్నాయి. తమపై పన్నుల భారం వేయని ఇటువంటి పాలకులను ప్రజలు ఆమోదిస్తారు. పాలకులు ఈ అవకాశాన్ని తమ పెత్తనం స్థిర పరచుకోవడానికి వినియోగించుకుంటారు. ఇది ఉభయ తారకంగా వుంటుంది.

అరబ్ దేశాలలో ప్రస్తుతం కొనసాగుతున్న నిరసనోద్యమాలు అంతిమంగా ప్రజాస్వామ్య పటిష్టతకు దోహదం చెయ్యాలి. ప్రజల్ని శాశ్వతంగా బానిసత్వంలో వుంచెయ్యడం సాధ్యం కాదని ఈజిప్టు రుజువు చేసింది. అక్కడి ప్రజలు స్వేచ్ఛను రుచిచూసారు. ప్రస్తుతం అక్కడ అరాచకం, సంక్షోభం కొనసాగుతూ వుండవచ్చు. కానీ ఈజిప్టులో లౌక్యం తెలిసిన శిష్టవర్గాలూ, బాగా విద్యాధికమైన మధ్యతరగతి వర్గాలూ, జాతి ఔన్నత్యం పట్ల ప్రగాఢ అభిమానమూ పుష్కలంగా వుండటంతో ప్రస్తుత పరిస్థితుల నుంచి బైటపడే అవకాశం వుంది. ■

# బీహారులో పౌరులకు ప్రభుత్వ సేవల హక్కు చట్టం

బీహారు చాలా కాలం పాటు చీకటి రాష్ట్రంగా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు ఆ రాష్ట్రం పాలనలో పారదర్శకతకీ, జవాబుదారీ తనానికీ దేశానికే వెలుగునిస్తున్నది, దారి చూపుతున్నది. నీతీష్ కుమార్ ప్రభుత్వం పౌరులు తమకు అందవలసిన సేవలపై ఫిర్యాదు చెయ్యడానికి గతంలో 'కియోస్క్'లను ఏర్పాటు చేసింది. ఇప్పుడు మరో పెద్దముందడుగు వేసింది. హక్కుగా సేవలు పొందే చట్టాన్ని తీసుకువచ్చింది. (Right to Sarvice Act.) పౌరులు ఈ చట్టంద్వారా ప్రభుత్వ సేవలను హక్కుగా పొందే అవకాశం ఏర్పడింది. నిర్దిష్ట గడువులోగా సేవలు అందించకపోతే సంబంధిత అధికారి ప్రతిరోజుకూ 250 రూపాయలు చొప్పున గరిష్టంగా 5000 రూపాయలు జరిమానా చెల్లించాల్సివస్తుంది.

ఈ సేవల హక్కుచట్టం 2011 ఏప్రిల్ 1 నుండి బీహారులో అమలులోకి రానుంది. దీని ప్రకారం పాస్‌పోర్టులో పోలీసు వెరిఫికేషన్‌కు 7 రోజులు, పోస్టుమార్టం రిపోర్టుకు 3 రోజులు, కులధృవీకరణ పత్రానికి 15 రోజుల గడువుగా నిర్ణయించారు. ఈ చట్టాన్ని 30 రకాల పౌరసేవలకు వర్తింపజేశారు. ఈ చట్టం సక్రమంగా అమలు జరిగేలా చూడడానికి రాష్ట్ర ప్రజాసేవల కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

బీహారును చూసైనా రాష్ట్ర ప్రభుత్వం నేర్చుకుంటుందా?

# విద్యుత్ ప్రాజెక్టులపై

## విధానాలు లేని ప్రభుత్వం




రాష్ట్రంలో ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతి విషయంలో ప్రభుత్వానికి ఓ విధానమంటూ లేకుండా పోయింది. ఇదే అదనుగా ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టుల యాజమాన్యాలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు అనువైన ప్రాంతాల్ని ఎంచుకుంటున్నాయి. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో 18 వాణిజ్య విద్యుత్ ప్రాజెక్టులు రాబోతున్నాయని అధికారిక సమాచారం. మరో 11 పైగా ప్రాజెక్టులు ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఇప్పటిదాకా 7 థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు రాబోతుండగా... మరో ఐదు ప్రాజెక్టులకు భూమి కేటాయించాలంటూ ప్రతిపాదనలు వచ్చాయి. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే రెండు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉండగా... మరో నాలుగు ప్రాజెక్టులు ప్రతిపాదనల్లో ఉన్నాయి.

ఖర్చులు తగ్గుతాయన్న ఉద్దేశంతో ఎక్కువగా కోస్తా తీరంలో ప్రైవేటు ప్రాజెక్టులు ఏర్పాటుచేయడానికి మొగ్గుచూపుతున్నారు. పైగా థర్మల్ ప్రాజెక్టుల్లో 95 శాతం నీటిని కూలింగ్‌కే వాడతారు. సముద్రపు నీటి వినియోగంతో పెద్దగా ఖర్చుండదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని బొగ్గు ఆధారిత థర్మల్ ప్రాజెక్టులన్నీ నెల్లూరు, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువగా ఏర్పాటు చేయడానికి మొగ్గుచూపుతున్నారు.

**కాలుష్య కాసారాలు :** థర్మల్ ప్రాజెక్టుల్లో భారీ స్థాయిలో బూడిద బయటికొస్తుంది. బూడిదను నీళ్లల్లో కలిపి నీటి వనరుల్లో కలిపేస్తాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఫలితంగా నీటి కాలుష్యంతోపాటు జల జీవరాసులకు ప్రాణహాని ఏర్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టులో వాడే నీటి ఉష్ణోగ్రతలు 7 డిగ్రీల కంటే తక్కువకు వచ్చే వరకు చల్లార్చి బయటకు వదలాలి. ప్రభుత్వ రంగంలో ప్రాజెక్టులైతే ఈ పనిచేస్తున్నాయి. కానీ ప్రైవేటు యాజమాన్యాలు ఖర్చులు తగ్గించుకునేందుకు ఈ నిబంధనల్ని తుంగలో తొక్కుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల నీటి విడుదలతో చుట్టుపక్కల పంటలు దెబ్బతినడంతో పాటు చేపలు, ఇతర జీవరాశులకు ముప్పు ఏర్పడుతోంది. ■

**రాష్ట్రంలో ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టుల వివరాలు**

| ప్రాజెక్టు పేరు | మెగావాట్లు సామర్థ్యం | జిల్లా |
|---|---|---|
| ఈస్ట్‌కోస్ట్ | 2640 | శ్రీకాకుళం |
| మేఘవరం | 500 | శ్రీకాకుళం |
| అల్ఫా | 2640 | విజయనగరం |
| జీఎంఆర్ ఎనర్జీ | 800 | తూర్పుగోదావరి |
| కోనసీమ | 820 | తూర్పుగోదావరి |
| జీఎంఆర్ ఎనర్జీ | 1320 | కాకినాడ(తూ.గో) |
| స్పెక్ట్రం | 1200 | కాకినాడ (తూ.గో) |
| నవభారత్ | 300 | తూర్పుగోదావరి |
| గౌతమి | 800 | తూర్పుగోదావరి |
| జీవీకే | 800 | తూర్పుగోదావరి |
| హిందూజా పవర్ | 1040 | విశాఖపట్నం |
| సింహపురి ఎనర్జీ | 540 | నెల్లూరు |
| మీనాక్షి ఎనర్జీ | 600 | నెల్లూరు |
| కృష్ణపట్నం (నవయుగ) | 1320 | నెల్లూరు |
| కినేట పవర్ | 1980 | నెల్లూరు |
| థర్మల్ పవర్‌టెక్ | 1980 | నెల్లూరు |
| నెలకాస్ట్ ఎనర్జీ | 1320 | నెల్లూరు |
| శేషాద్రి | 1320 | మహబూబ్‌నగర్ |

# కాకరాపల్లి థర్మల్ ప్రాజెక్టు అనుమతుల్ని పునః స్సమీక్షించాలి

## లోక్‌సత్తా నిజనిర్ధారణ కమిటీ నివేదిక

*శ్రీకాకుళం జిల్లా కాకరాపల్లి వద్ద తలపెట్టిన ఈస్ట్‌కోస్ట్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంపై స్థానిక ప్రజలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ సుమారు **195**రోజుల నుంచి చేస్తున్న రిలే నిరాహారదీక్షల శిబిరాల్ని పోలీసులు తొలగించటం, ఉద్రిక్తతల మధ్య కాల్పులు జరపటం, వడ్డితాండ్రలో ఇళ్లను, వరికుప్పలను తగలబెట్టటం, కాల్పుల్లో ఇద్దరు మరణించిన నేపథ్యంలో లోక్‌సత్తా ఫిబ్రవరి **28, 2011**న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కె. పోలినాయుడుతో ఏర్పాటు చేసిన త్రిసభ్య నిజనిర్ధారణ కమిటీ తన నివేదికను పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌కు సమర్పించింది. నివేదికలోని ప్రధానాంశాలను ఈ దిగువ ఇస్తున్నాం...*



"ఈస్ట్‌కోస్ట్ థర్మల్ కేంద్రం ఏర్పాటు వల్ల మత్స్య, ఇతర సహజసంపదకు హానికరమని 2007లో ఆ ప్రాజెక్టుకఅనుమతులకు దరఖాస్తు చేసుకున్న తరుణంలోనే రాష్ట్ర అటవీ, మత్స్యశాఖలు నివేదికలు ఇచ్చాయి. అయినా 2009లో అనుమతుల మంజూరు నుంచి తాజాగా ప్రజలపై కాల్పుల వరకూ నిబంధనల ఉల్లంఘన ఓ పరంపరగా సాగింది. జిల్లా యంత్రాంగం తప్పుడు సమాచారాన్ని పంపింది. తంపర భూములను పోరంబోకు నేలలుగా చూపి, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించి, 1978 నుంచి మత్స్యకారుల సొసైటీల ఆధ్వర్యంలో పేదప్రజలు జీవనోపాధిని పొందుతున్న భూముల్లో అసత్యాలతో అనుమతులు పొందారు, భూసేకరణ చేశారు. కాకరాపల్లి తంపర భూములు వ్యవసాయానికి అనుకూలం కాదని ఎమ్మార్వో నివేదిక ఇచ్చారు. కానీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్ ప్రకారం అవి చిత్తడి నేలలే అని తేలింది. కేంద్రప్రభుత్వ నిర్వచనం ప్రకారం పరిశీలించినా అవి ఖచ్చితంగా చిత్తడి నేలలే అని ధృవీకరణ అయ్యింది. ప్రజలు ఆందోళనలకు దిగటంతో 2010, జులైలో సందర్శించిన రెండు నిపుణుల కమిటీలు కూడా ఇక్కడ ప్రాజెక్టు పర్యావరణానికి హానికరమని, ఈ చిత్తడి భూములలో ప్రాజెక్టు నిర్మాణం తగదని కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినా ఫలితం లేకపోయింది.

సోంపేట థర్మల్ ప్రాజెక్టు తరహాలోనే ఈస్ట్‌కోస్ట్ థర్మల్ ప్రాజెక్టుకూ అనుమతులే బూటకాల ప్రాతిపదికన తెచ్చుకోవటం ఒక ఎత్తయితే, వడ్డితాండ్ర, కాకరాపల్లి, ఆకాశలక్కవరంలో తంపర భూములనే 2050 ఎకరాలు సేకరించారు. కర్మాగారం పూర్తయితే సాధారణ వర్షపాతం కురిసినా మొత్తం నీటి ప్రవాహం ఎటూ పోకుండా చుట్టుపక్కల ఉన్న సుమారు 30,000 ఎకరాల సాగుభూమి ముంపునకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజలకు ఎటువంటి ప్యాకేజీ లేకుండా కారుచౌకగా భూముల్ని కేటాయించారు. దాదాపు 3,000మంది మత్స్యకారుల, ఇతర పేదవర్గాల పునరావాస, పరిహారాలను పట్టించుకోలేదు. పబ్లిక్ హియరింగ్‌లో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు అని చెప్పకుండా ప్రజలకు అబద్ధాలు చెప్పారు. మరోవైపు, కర్మాగార స్థలానికి పది కిలోమీటర్లలోపు ఉన్న తేలినీలాపురంలో సుమారు 120 రకాల

పక్షులు వివిధ దేశాల నుంచి వస్తుంటాయి. అరుదైన పక్షిజాతులకు నిలయంగా ఉన్నందున ఆ స్థలాన్ని విధిగా పరిరక్షించాలనే నిబంధనలను కాలరాసి కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు లేకుండానే, జాతీయ పర్యావరణ అప్పీలేట్ అథారిటీ (ఎన్.ఇ.ఎ.ఎ)లో విచారణ పెండింగ్‌లో ఉండగానే పనులు చేపట్టారు.

దాదాపు ఆరునెలలుగా ప్రజలు న్యాయబద్ధంగా శిబిరాల్లో నిరసన దీక్షలు చేస్తుంటే పోలీసులు దౌర్జన్యంగా, ప్రజల్ని రెచ్చగొట్టేరీతిలో తొలగించారు. కాల్పులు జరగటానికి ఐదు రోజుల ముందు నుంచే హైడ్రామా నడిపించారు. 144వ సెక్షన్‌ను అమలు చేస్తున్నట్టు ఫిబ్రవరి 24 రాత్రి ప్రకటించారు. ఆ మరుసటిరోజు ఉదయాన్నే ఎటువంటి ఔచిత్యం లేకుండా కొంతమందిని అరెస్టు చేయటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో ఆందోళనలు రేగి వాస్తవాల్ని అందరి దృష్టికీ తేవాలనే ఆరాటంతో రోడ్ల మీదకు వచ్చారు. చివరకు ఫిబ్రవరి 28న ఆ పరిస్థితి కాల్పులకు దారితీసింది.

మహిళలు కనీసం మరుగుదొడ్లకు కూడా బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే పోలీసులు నిర్బంధించారు. కాకరాపల్లిలో ఆందోళనలు జరుగుతుంటే వడ్డితాండ్రలో ఇళ్లను, ఏడాదిపాటు కష్టపడి పండించిన ధాన్యం కుప్పలను తగలబెట్టారు. ఈ మొత్తానికీ వెనక రాజకీయ నేతలే ఉన్నారు. నేతల దుర్మార్గం వల్ల ఈస్ట్‌కోస్ట్ థర్మల్ కేంద్రం నిర్మాణం చివరకు ప్రజలకు, పోలీసులకు మధ్య శాంతిభద్రతల యుద్ధంగా మారింది. రబ్బర్ బుల్లెట్లనే ఉపయోగించమని ప్రభుత్వం చెప్పినా పోస్టుమార్టంలో అసలైన బుల్లెట్లే వాడారని రాసి ఉంది. ఈ ప్రాజెక్టు అనుమతితో పాటు జిల్లాలో అనుమతులు పొందిన ఇలాంటి మరో 6 ప్రాజెక్టులనూ పునస్సమీక్షించాలి" అని నివేదిక పేర్కొంది.

ఈ ప్రాజెక్టు వల్ల తమ జీవనోపాధిని కోల్పోయి ఆందోళనల బాట పట్టిన ప్రజలకు తగిన ఉపాధిని కల్పించాలని, తప్పుడు కేసుల్ని ఎత్తివేసి శాంతిభద్రతల్ని పరిరక్షించాలని నివేదిక సూచించింది. ఇక మీదట ఇటువంటి అనర్థాలు జరగకుండా ఇప్పుడున్న పర్యావరణ, భూమి, నీరు, చెట్టు చట్టాలను సక్రమంగా అమలు చేసే యంత్రాంగాన్ని ఏర్పాటుచేయాలని, చిత్తడినేలల్లో ఎటువంటి పరిశ్రమలూ స్థాపించకుండా సమగ్ర చట్టాన్ని తేవాలని నివేదిక సిఫార్సు చేసింది. హేతుబద్ధ ప్రాతిపదికలతో, ప్రజల్ని ఒప్పించాకే ప్రాజెక్టుల్ని చేపట్టాలని స్పష్టంచేసింది.

నివేదికను సమగ్రంగా పరిశీలిస్తామని, రాష్ట్ర, కేంద్రప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి నిష్పాక్షిక విచారణ, తగుచర్యల కోసం కృషి చేస్తానని, ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని జయప్రకాష్ నారాయణ్ ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు తెలిపారు.

## మార్చి 6 ముఖ్యమంత్రితో చర్చలు...

ఈ నివేదికను మార్చి 6వ తేదీన డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ, కటారి శ్రీనివాస్ రావు తదితరులు ముఖ్యమంత్రిని కలిసి ఈ నివేదికలోని అంశాలను చర్చించారు. కాకరాపల్లిలో క్షతగ్రాతులకు పూర్తి వైద్యసాకర్యాలు కల్పించాలి, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. కాకరాపల్లి ప్రాజెక్టు పనులు నిలిపి వెయ్యాలని, ప్రభుత్వం థర్మల్ స్టేషన్‌లపై ఏకపక్ష నిర్ణయాలకు స్వస్తి చెప్పాలని కోరారు. స్థలం ఎంపిక, భూసేకరణ నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలు, పర్యావరణ సమస్యలు పరిశీలించడానికి ఒక చట్టబద్ధమైన అథారిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధి బృందం ప్రకటించింది. ■

## ఎన్నారైలకు ఓటుహక్కు

దేశంలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రవాస భారతీయులకు (ఎన్నారై) తొలిసారిగా ఓటు వేసే అవకాశం రానుంది. అస్సాం, పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ శాసనసభలకు ఏప్రిల్, మే నెలల్లో జరిగే ఎన్నికల్లో ప్రవాస భారతీయులు స్వయంగా వచ్చి ఎన్నికల్లో ఓటు వేయవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి ఎస్ వై ఖురేషి ఈ మేరకు వివరాలందించారు. ప్రవాస భారతీయుల పాస్‌పోర్టులో వెల్లడించిన శాశ్వత చిరునామా ఇందుకు ప్రాతిపదికగా ఉంటుందని తెలిపింది. భారతదేశంలో జరిగే ఎన్నికల్లో ప్రవాస భారతీయులకు ఓటు హక్కు కల్పించే విషయమై గత కొన్నేళ్ళ నుంచీ చర్చలు కొనసాగుతుండగా ఇప్పుడు కార్యరూపం దాల్చనుంది.

# థర్మల్ కేంద్రాలు, సెజ్‌లు, పోర్టులకు భూసేకరణ ప్రభుత్వ వైఖరిని పునః సమీక్షించాలి

థర్మల్ విద్యుత్ కేంద్రాలు, సెజ్‌లు, పారిశ్రామిక వాడల ఏర్పాటుపై ప్రజలలో పెల్లుబుకుతున్న నిరసన జ్వాలలకి ప్రభుత్వ అనాలోచిత చర్యలే కారణంగా లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది. వీటిని ప్రజలపై ఏకపక్షంగా రుద్దాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే పరిస్థితి మరింత విషమిస్తుందని లోక్‌సత్తా పార్టీ హెచ్చరిస్తున్నది. దీనికి ఉదాహరణగా శ్రీకాకుళం జిల్లా సోంపేట, కాకరాపల్లిలలో తలెత్తిన ప్రజాగ్రహం మనందరికి తెలుసు.

**1. నిర్ధిష్టమైన మార్గదర్శకాలు ప్రకటించాలి.**

ఎ. విద్యుత్ కేంద్రాల కోసం, సెజ్‌లకోసం, పరిశ్రమల కోసం రెండు పంటలు పండే భూముల సేకరణను నిషేధించాలి.

బి. పర్యావరణానికి, జీవ్యావరణానికి హానికలిగించే ప్రత్యేక ప్రాంతాలతో భూముల సేకరణను నిషేధించాలి.

సి. కాలుష్య నివారణకు, ఆ ప్రాంతవాసుల ఆరోగ్యానికి, పంటలకు పర్యావరణానికి హాని జరగకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకున్న తర్వాతే ఉత్పత్తికి అనుమతించే నిర్ధిష్టమైన హామిని ప్రభుత్వం ప్రకటించాలి.

**2. రైతులకు, నిర్వాసితులకు బహుముఖ పరిహారాలు**

ఎ. భూసేకరణలో రైతులకు ఇచ్చే పరిహారం మార్కెట్ రేటు కంటే మించి వుండాలి. అలా సేకరించిన భూమిలో ఒక వాటాను తిరిగి ఆ రైతులకు దక్కే ఏర్పాటు చేయాలి.

బి. భూమికి మాత్రమే పరిహారంతో పాటు అదనంగా షేర్ల రూపంతో పరిహారం ఇవ్వాలి.

సి. ప్రతి కుటుంబంలో ఒకరికి తగిన శిక్షణ ఇచ్చి ఉద్యోగం ఇవ్వాలి.

ఇలా రైతుల భవిష్యత్తుకు షేర్ల రూపంలో, ఉద్యోగం రూపంలో శాశ్వత భద్రత కల్పించి తీరాలి. షేర్లు, ఉద్యోగం అవసరం లేదనుకున్న వారికి నగదు రూపంలో పరిహారాన్ని అదనంగా చెల్లించాలి.

డి. భూములు కోల్పోయిన వారికి మాత్రమే పరిహారాన్ని పరిమితం చెయ్యకుండా ఈ భూముల మీద ఆధారపడివున్న గ్రామస్తులందరికీ ప్రత్యేక పరిహార పథకాన్ని వర్తింపజెయ్యాలి. దానితో పాటు గృహవసతి, ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాట్లు చెయ్యాలి.



**3. భూసేకరణకు - పరిహారానికి ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చెయ్యాలి.**

మార్గదర్శకాలకు అనుగుణంగా భూసేకరణకు, పరిహారం చెల్లింపులకు తగిన అధికారాలతో ఒక స్వయం ప్రతిపత్తి గల అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యాలి. ఇది క్వాజీ జ్యుడీషియల్ సంస్థగా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేదిగా వుండాలి.

సెజ్‌లను రియల్ ఎస్టేట్లుగా మార్చకుండా ఏ పరిశ్రమకు ఎంత భూమి అవసరమో ఈ స్వతంత్ర సంస్థ నిర్ణయిస్తుంది. భూమి కోల్పోయిన వారికి, నిర్వాసితులందరికీ పరిహారాన్ని నిర్ణయించి చెల్లింపులకు బాధ్యత వహిస్తుంది. ఇది పూర్తి అయిన తర్వాత, అన్ని అనుమతులు పొందిన తర్వాత ప్రాజెక్టు పనులకు అనుమతిస్తుంది. అంతిమంగా కాలుష్యానికి, ప్రజారోగ్యానికి భంగం కలగని రీతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరిగిన తర్వాతే ఉత్పత్తికి అనుమతిస్తుంది. ఇలాంటి విశేషాధికారాల సంస్థ మాత్రమే ఆందోళన చెందుతున్న ప్రజల్ని సంతృప్తి పరుస్తుందని లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాల అవసరాన్ని లోక్‌సత్తా పార్టీ గుర్తిస్తుంది. అదే సమయంలో ఇది అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతుల ద్వారా సాధించాలని వాంఛిస్తున్నది. ప్రభుత్వం తక్షణమే ఈ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వం మొండిగా తన పాత వైఖరినే కొనసాగిస్తే అది నిరంతర శాంతి భద్రతల సమస్యగా మారి పారిశ్రామికాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగించేదిగా పరిణమిస్తుందని అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా హెచ్చరిస్తున్నది. ■

# భారతీయ తత్వాన్ని ఆవిష్కరించిన సచ్చిదానంద మూర్తి

**- ఆర్వీ రామారావు**

భావవాద తత్వశాస్త్రాలను అనుసరించే వారికి పురోగమన భావాలు ఉండవేమోనన్న అభిప్రాయానికి అపవాదు ఏదైనా ఉంటే దానికి నిలువెత్తు నిదర్శనం ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి మాత్రమే. హేతువాదులను సైతం మెప్పించగలిగిన భావవాద తత్వవేత్త ఆయన. వివిధ తత్వశాస్త్రాల అధ్యయనానికి ఆయన అనుసరించిన పద్ధతి, వ్యక్తంచేసిన అభిప్రాయాలు వివిధ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకునిగా పనిచేసినప్పుడు విభిన్నమైన తత్వశాస్త్రాల పరిశోధనకు ఇచ్చిన ప్రోత్సాహం మొదలైనవన్నీ ఆయన సమ్యక్ దృక్పథానికి, సమన్వయ దృష్టికి తార్కాణాలే. రకరకాల దర్శనాలను, ధర్మాలను, మతాలను ఆయన చూసిన తీరు ఆయనకున్న సర్వమత, సర్వధర్మ సమగ్ర దృక్పథానికి దారితీసింది.

1924 సెప్టెంబర్ 25న గుంటూరు జిల్లా తెనాలికి దగ్గర్లోని సంగం జాగర్లమూడి గ్రామంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సచ్చిదానందమూర్తి 87 ఏళ్ల నిండు జీవితం గడిపారు. తన సుదీర్ఘ జీవనయానంలో ప్రతి క్షణాన్ని అధ్యయానానికి, పరిశోధనకీ వినియోగించుకున్నారు. తత్వశాస్త్ర పరిశోధన, అధ్యయనాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, జిడ్డు కృష్ణమూర్తి వంటి ఉద్దండుల సరసన నిలవగలిగిన ఏకైక వ్యక్తి సచ్చిదానంద మూర్తి. డాక్టర్ రాధాకృష్ణన్ నిర్వర్తించిన పాత్రను పోషించవలసిన బాధ్యత ఇక సచ్చిదానందమూర్తిదే అని ప్రసిద్ధ భాషాతత్వవేత్త డాక్టర్ సునీత్ కుమార్ చటర్జీ వ్యాఖ్యానించినప్పటికీ తాను ఏ విధంగానూ మహామనిషి రాధాకృష్ణ పండితునికి సాటిరానని చెప్పగలిగిన వినమ్రత సచ్చిదానందమూర్తి సొంతం.

మానవునిలోని ద్వంద్వ ప్రవృత్తి యుద్ధాలకు కారణం అని ఆయన సూత్రీకరించారు. భగవద్గీతలో ప్రబోధించిన శాంతి, మహాత్మగాంధీ అనితర సాధ్యంగా అమలు చేసి చూపిన అహింసకు సమగ్ర వివరణ ఇవ్వడం కోసమే కేంబ్రిడ్జి మేధావి డాక్టర్ బొకెట్‌తో కలిసి **"స్టడీస్, ఇన్ ది ప్రాబ్లమ్ ఆఫ్ పీస్"** అన్న గ్రంథం రాశారు. సౌహార్దత, సౌభ్రాతృత్వం. విశ్వవ్యాప్తంగా అమలుచేసి తీరవలసిన ఆదర్శాలనీ, సామాజిక ఆర్థిక రంగాలలో సమానత్వం శాంతికి అత్యవసరం అని నొక్కి చెప్పిన సచ్చిదానందమూర్తి మాటలు ఆయనలోని విశ్వజనీన దృక్పథానికి ఆనవాళ్లు, యుద్ధానికి వ్యతిరేకంగా శాస్త్రవేత్తలు, మేధావులు ఏకమై ఉద్యమించాలనీ, ప్రపంచ శాంతి కోసం పాటు పడాలని పిలుపు ఇవ్వడం ద్వారా ఆయన విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ సరసన నిలిచారు. మానవ హక్కుల పరిరక్ష ఆవశ్యకతను ఆయన మనసారా ఆహ్వానించారు. ఒకరి హక్కులకు మరొకరు దుర్వినియోగం చేయడం ద్వారా తమ సామర్థ్యాన్ని విస్తరించుకోవడాన్ని ఈసడించారు.

సచ్చిదానంద మూర్తి మౌలికంగా తత్వవేత్త ఆయనప్పటికీ తన రచనలలో అన్ని శాస్త్రాలను, అన్ని రంగాలను స్పృశించారు. విద్య, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, చరిత్ర మొదలైన రంగాలలో కూడా ఆయనకున్న అభినివేశం, ఆసక్తి ఆయన జ్ఞాన పరిధిని మరింత విస్తరించడానికి తోడ్పడ్డాయి.

ఆయన కృషి ప్రధానంగా భారత్‌కే పరిమితమైనా తాను సముపార్జించిన జ్ఞాన సుధను ఖండాంతరాలలో వెదజల్ల గలిగారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా, యూరప్ ఖండాల్లోని అనేక దేశాలలో ఆయన చేసిన అనేకానేక ప్రసంగాలు అక్కడి వారి ప్రశంసలు పొందగలిగారు. 1959లో అమెరికాలోని ప్రిన్సిటన్ యూనివర్సిటీలో, బీజింగ్‌లోని పీపుల్స్ యూనివర్సిటీ ఆఫ్ చైనాలో, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాల నుంచి ప్రత్యేక ఆహ్వానంపై 1963లో అక్కడ ప్రసంగించారు. ఆయన ప్రసంగించని ప్రపంచ ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు దాదాపుగా లేవు. అనేక అంతర్జాతీయ, జాతీయ సంస్థలకు, సంఘాలకు వివిధ హోదాల్లో విశిష్టమైన సేవలు అందించారు. అమెరికా ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఇంటర్నేషనల్ ఫిలసాఫికల్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా, ఇండియన్ ఫిలసాఫికల్ కాంగ్రెస్ చైర్మన్‌గా, సొసైటీఫర్ ఇండియన్ ఫిలాసఫీ

అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పాటు వ్యవహరించారు.

విశ్వమంతా చుట్టివచ్చినా, వృత్తిరీత్యా ప్రపంచంలోని ప్రసిద్ధ నగరాలలో పర్యటించినా పదవీ విరమణ తర్వాత గత రెండు దశాబ్దాల నుంచి తన పిత్రు పితామహులు నివసించిన ఇంట్లోనే ఉంటూ సంగం జాగర్లమూడిలోని తన స్వస్థలంపై తనకు గల అభిమానాన్ని చాటుకున్నారు. నిర్మొహమాటంగా మాట్లాడడం, సంభాషణ చాతుర్యం అవసరమైనప్పుడు వ్యంగ్య బాణాలు విసరగలిగిన సత్తా, హాస్యస్ఫోరకత సచ్చిదానంద మూర్తి వ్యక్తిత్వాన్ని పట్టిఇచ్చే విశిష్ట లక్షణాలు.

తన తండ్రి వీరభద్రయ్యకు మతాల అధ్యయనం మీద ఉన్న అనురక్తే పురాణేతిహాసాల మీద సచ్చిదానంద మూర్తికి చిన్న నాటినుంచే ఆసక్తికి దోహదం చేస్తే పదిహేనేళ్ల వయసులోనే భగవద్గీత పై వ్యాఖ్యానం రాసే ప్రతిభ అబ్బేట్టు చేసింది. ఈ వ్యాఖ్యానాన్ని చూసి సర్ కట్టనుంచి రామలింగా రెడ్డి అబ్బురపడి పోయారు.

'రివిలేషన్ అండ్ రిజన్ ఇన్ అద్వైత వేదాంత' అన్న ఆయన గ్రంథం మతాలకు సంబంధించిన తాత్వికాంశాలకు చక్కటి విశ్లేషణ. యూదు, క్రైస్తవ తాత్వికతలను వింగడిస్తూ సంస్కృత గ్రంథాలలో ఆధారాలు చూపుతూ ఆయన ఈ గ్రంథాన్ని రచించారు. చిన్న తనంలోనే బైబిల్, ఖురాన్ తెలుగు అనువాదాలు చదవడం వల్ల, సుప్రసిద్ధ సాంప్రదాయక పండితుల వద్ద సంస్కృత అధ్యయనం వల్ల ఆయన సహజంగానే తత్వశాస్త్రం పట్ల ఆకర్షితులయ్యారు. గణిత శాస్త్రంలోని తర్కం, తులనాత్మక అధ్యయనంలో తనకు మరొకరు సాటిలేరు. అని నిరూపించుకున్న శైలేశ్వర్ సేన్, తర్కశాస్త్రం, సమకాలీన తత్వశాస్త్రాల్లో ఉద్దండుడైన పి.టి.రాజు శిష్యరికం సచ్చిదానంద మూర్తిలోని జిజ్ఞాసకు పదును పెట్టింది. ఉడ్‌రాస్, రామతీర్థ, సర్వేపల్లి రాధాకృష్ణన్ రచనలు అమితంగా ప్రభావితం చేశాయి. గుంటూరు కళాశాలలో విద్యాభ్యాసం పూర్తయిన తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆనర్స్, డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు.

పిహెచ్‌డి పూర్తిచేసి అధ్యాపక వృత్తి చేపట్టిన తర్వాత ఆయన భారత, పాశ్చాత్య తత్వశాస్త్రాలపైనే కాక, విద్యావిధానాలను కూడా పరిశీలించడం ప్రారంభించారు. విషయం మౌలిక తత్వాన్ని గ్రహించడమే విద్య అన్న భారతీయ దృక్కోణాన్ని, వ్యక్తిలో నిగూఢంగా ఉండే సామర్థ్యాలను వెలికి తీయడమే విద్య అన్న పాశ్చాత్య దృక్పథాన్ని ఆకళింపు చేసుకుని రెండింటి సమ్మిశ్రణం కోసం కృషి చేశారు. ఈ సమన్వయ దృక్పథం ఆయన రచనల్లోనూ ప్రతిబింబించింది.

భారతీయ తాత్విక ధోరణి బ్రహ్మసత్యం జగన్మిధ్య అన్న సంకుచితమైన ధోరణికి పరిమితం అయింది కాదనీ ఆర్థిక విధానాలకు కరదీపిక లాంటి అర్థశాస్త్రం, ఆరోగ్య పరిరక్షణకు అనువైన ఆయుర్వేదం అంతరిక్ష శోధనలో జాంబవంతుని అంగలతో దూసుకెళ్లిన ఖగోళ శాస్త్రం, సంసారిక జీవిత సారాన్ని ఎత్తిచూపిన కామసూత్ర వంటివి అన్ని భారతీయ దార్శనికతను సర్వసమగ్రం చేశాయని సచ్చిదానందమూర్తి భావించారు. అవన్నీ భారతీయ సంస్కృతిలో భాగమేననీ, వాటి సమకాలీన స్వరూపమే భారతీయ సంస్కృతికి ఆనవాలు అని సచ్చిదానంద మూర్తి అంటారు. భారతీయ సంస్కృతి ప్రాభవాన్ని విడమర్చడానికే ఆయన 'భారతీయ చైతన్యం' అన్న గ్రంథం రాశారు.

వేదాలు, షడ్దర్శనాలు, జైను బౌద్ధం వంటి మతాలు, చార్వాకుల భౌతిక వాదం మొదలైనన్నీ కలిస్తేనే భారతీయ చింతన సమగ్ర స్వరూపం అవగతమవుతుందని సచ్చిదానందమూర్తి భావించారు. భావవాద భౌతికవాద తత్వశాస్త్రాలను విడదీసి చూడకుండా ఆ రెండింటికీ మన సమాజంలో మూలాలను అన్వేషించడంలో ఆయనది విశిష్టమైన మార్గం. తాను మౌలికంగా భావవాది అయినా భౌతికవాద తాత్వికత అయిన చార్వాకాన్ని తృణీకరించలేదు.

బౌద్ధం మీద ఆయనకు ప్రత్యేకమైన అభిమానం ఉండేది. బౌద్ధాన్ని మనం ఏనాడో మన దేశం నుంచి పారదోలడం వల్ల ప్రస్తుతం అది ఇక్కడ నామమాత్రా వశిష్టంగానే ఉంది. కాని బౌద్ధాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధంపై లభించే ప్రామాణిక గ్రంథాలన్నింటినీ తెప్పించి ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి పుష్టి చేకూర్చారు. ఆ విశ్వవిద్యాలయంలో బౌద్ధ పీఠాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఆయన నిర్వహించిన చర్చాగోష్ఠులు బౌద్ధం మీద ఆసక్తిని ప్రేరేపించాయి. గుంటూరులో ఆంధ్రవిశ్వవిద్యాలయం స్నాతకోత్తర కేంద్రాన్ని ప్రారంభించాలనుకున్నప్పుడు ఆయనే దానికి ప్రత్యేకాధికారిగా వ్యవహరించారు. బౌద్ధ సంస్కృతికి చిహ్నాలు మన రాష్ట్రంలో అనేకం ఉన్నాయి. మహాయానం ఇక్కడే ప్రారంభం అయినందువల్ల నాగార్జున విశ్వవిద్యాలయంలో మహాయాన అధ్యయన కేంద్రం ప్రారంభించడం వెనక ప్రేరణ కూడా సచ్చిదానందమూర్తిదే.

ఆయన కేవలం పరిశోధనకు, అధ్యాపకత్వానికే పరిమితం కాలేదు. విద్యావ్యవహారాల నిర్వహణలో కూడా నిష్ణాతులు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఉన్న సమయంలో విశ్వవిద్యాలయ వ్యవహారాల్లో రాజకీయ జోక్యానికి అవకాశం లేకుండా కట్టడి చేసి ఆదర్శప్రాయమైన పరిపాలనా విధానాన్ని ప్రవేశ పెట్టారు. అర్హులకు చేయూతనందివ్వడం, అనర్హులకు దరిచేరనివ్వక పోవడం ఆయన కర్తవ్యనిష్ఠకు సంకేతం.

ఆయన బిరుదులు, సత్కారాలు తెచ్చుకున్న వారు కాదు. ఆయన చేసిన కృషి అవి రాక తప్పని అనివార్య స్థితిని కల్పించాయి. 2001లో 'పద్మవిభూషణ్'తో ఆయనను సత్కరించారు. తత్వశాస్త్రంలో కృషి చేసే వారికి ఇచ్చే డా॥బి.సి.రాయ్ పురస్కారం అందుకున్న మొదటి వ్యక్తి ఆయనే అనేక విదేశీ విశ్వవిద్యాలయాలు, ప్రసిద్ధ సంస్థలు ఆయనకు అవార్డులతో సత్కరించాయి. మాస్కోలోని రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, బల్గేరియాలోని సోఫియా విశ్వవిద్యాలయం, బీజింగ్‌లోని పీపుల్స్ యూనివర్సిటీ, జర్మనీలోని పోల్- విట్టన్‌బర్గ్ విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేశాయి. దేశంలోని తొమ్మిది విశ్వవిద్యాయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్లు అందజేశాయి.

పదవీ విరమణానంతర నియామకాల కోసం ఆయన వెంపర్లాడలేదు. తన స్వగ్రామానికి పరిమితమై రెండు దశాబ్దాల పాటు తనకు ఇష్టమైన అధ్యయనంలోనే గడిపారు. ఈ నెల 24న తేదీన తుదిశ్వాస విడిచిన సచ్చిదానందమూర్తి లేని లోటు పూరించలేకున్నది నిజమే అయినా ఆయన మార్గాన్ని అనుసరించేవారు ఎందరు అన్నదే ముఖ్యంగా ఆలోచించవలసిన విషయం. ■

# టిబెట్ ప్రవాస ప్రభుత్వ నాయకత్వానికి దలైలామా గుడ్‌బై



భారత దేశంలో ప్రవాసంలో నడుస్తున్న టిబిటన్ల ప్రభుత్వ రాజకీయ నాయకత్వ బాధ్యతలనుంచి తప్పు కుంటానని బౌద్ధమత గురువు దలైలామా ప్రకటించారు. అయితే ఆధ్యాత్మిక నాయకునిగా కొనసాగుతూ, టిబెట్ స్వయంప్రతిపత్తికోసం పోరాడుతానని ఆయన స్పష్టం చేశారు. దశాబ్దాలుగా టిబెట్ స్వాతంత్రం కోసం జరుగుతున్న పోరాటాన్ని దలైలామా ముందుండి నడిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 20న ప్రపంచవ్యాప్తంగా ఉన్న టిబెటన్లు ఓటు వేయడం ద్వారా కొత్త పార్లమెంట్‌ను ఎన్నుకుంటారని తెలిపారు. తమ ప్రజలు చైనా నుంచి టిబిట్‌కు స్వయంప్రతిపత్తిని కోరుకుంటున్న నేపథ్యంలో కొత్త నేతకు విశేష అధికారాలు అప్పగిస్తామని అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో వందలాదిమంది టిబెటన్లు పాల్గన్నారు. అయితే దలైలామా ప్రకటనపై చైనా తీవ్రంగా స్పందించింది. దలైలామా మతం ముసుగులో రాజకీయ కార్యకలాపాలకు పాల్పడుతూ తమ దేశాన్ని చీల్చడానికి అనేక ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి జియాంగ్ యూ అన్నారు. ఇదిలా ఉండగా దలైలామా టిబెటన్ల రాజకీయ నాయకత్వం నుంచి తప్పుకున్నా ఆయనకు తాము ఇచ్చే గౌరవంలో ఎలాంటి మార్పు ఉండదని భారత ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆయనకు ఎప్పటికీ విశిష్ట అతిథిగానే పరిగణిస్తామని విదేశాంగశాఖ తెలిపింది.

## దలైలామా ప్రస్థానం

- 1935, జూలై 6న టిబెట్‌లోని టస్కర్‌లో జననం
- 1938లో 14వ దలైలామాగా అవతరణ
- 1940లో టిబెటన్ల బౌద్ధ గురువుగా అధికారికంగా ఎంపిక
- 1950లో టిబెట్ అధిపతి హోదా. టిబెట్‌లో చైనా బలగాల ప్రవేశం
- 1954, 1956లో చైనాలో మావో జెడాంగ్, భారత్‌లో ప్రధాని నెహ్రూతో చర్చలు
- 1959లో భారత్‌కు వలస. ధర్మశాలలో ప్రవాస ప్రభుత్వం ఏర్పాటు
- 1988లో టబెట్‌కు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని చైనాకు ప్రతిపాదన
- 2008లో నోబెల్ శాంతి బహుమతి
- మార్చి, 2011న ప్రవాసంలో నడుస్తున్న టిబెటన్ల ప్రభుత్వం రాజకీయ నాయకత్వ బాధ్యతలనుంచి తప్పుకుంటానని ప్రకటన.

# శరవేగంలో నగరాలు.... చాలీ చాలని వసతులు

రానున్న 20 ఏళ్లలో హైదరాబాద్, కోయంబత్తూరు, చెన్నై నగరాలు వలసలకు ప్రధాన కేంద్రాలుగా నిలుస్తాయని పట్టణాల్లో మౌలిక సదుపాయాలపై నియమించిన ఉన్నత స్థాయి కమిటీ అంచనా వేసింది. 2011 అంచనాల మేరకు హైదరాబాద్ జనాభా 79 లక్షలుగా ఉందని, 2031 నాటికి అది రెండింతలవుతుందని అంటే 1.58 కోట్లకు చేరుతుందని పేర్కొంది. కమిటీ ఇటీవలే కేంద్రానికి నివేదికను సమర్పించింది. అందులోని వివరాల ప్రకారం...

- జనాభా ప్రకారం చూస్తే దేశంలో బెంగళూరుకు పోటీగా ఐదో మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఉంది.
- హైదరాబాద్‌లో 50 శాతం మంది ప్రజలకు కనీసం మురుగునీటి కనెక్షన్లు లేవు.
- దేశవ్యాప్తంగా పట్టణీకరణలో తమిళనాడు మొదటి స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో ఉంది.

**రాష్ట్రంలో పట్టణాలు 174**

**రాష్ట్రంలో పట్టణాల సంఖ్య 174కు చేరింది. ఇందులో...**

- 50 లక్షలకు పైగా జనాభా ఉన్నవి: 1
- 10 లక్షల జనాభా ఉన్నవి : 2 (విజయవాడ, విశాఖపట్నం)
- 10 లక్షలలోపు జనాభా కలిగినవి : 35
- లక్షవరకూ జనాభా ఉన్నవి : 45
- 20వేల నుంచి 50 వేల జనాభా కలిగినవి : 46
- 20 వేల కన్నా తక్కువ ఉన్నవి :45

రూ॥ 39.2 లక్షల కోట్లు కావాలి.

దేశవ్యాప్తంగా పట్టణాల్లో సదుపాయాలు కల్పించడానికి రానున్న 20ఏళ్లలో రూ॥39.2 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని కమిటీ అంచనా వేసింది.

**పెట్టుబడులు ఇలా ఉండాలి**

**తాగునీరు:** పట్టణాల్లో ప్రజలకు 100 శాతం తాగునీటి సౌకర్యం కల్పించడానికి 20 ఏళ్లలో 3.2 లక్షల కోట్లు అవసరం. ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల రక్షిత నీరు సరఫరా చేయాలి. నిర్వహణ ఖర్చులకు రూ॥5.5 లక్షల కోట్లు అవసరం.

**పారిశుద్ధ్యం :** మురుగునీటి పారుదల వ్యవస్థకు 2.4 లక్షల కోట్లు కావాలి.

**రోడ్లు:** ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. ఇందుకోసం మొత్తం పెట్టుబడుల్లో 17.3 లక్షల కోట్లు కేటాయించాలి. నిర్వహణ కోసం మరో 3.8 లక్షల కోట్లు ఇవ్వాలి.

**పట్టణ రవాణా:** మెట్రో రైలు, బీఆర్‌టీఎస్ ప్రాజెక్టులకు దాదాపు రూ॥4.5 లక్షల కోట్లు ఖర్చు చేయాలి. ఇందులో మెట్రోకు రూ॥ 3.6 లక్షల కోట్లు, బీఆర్‌టీఎస్‌కు రూ॥90వేల కోట్లు కేటాయించాలి.

**ట్రాఫిక్ నిర్వహణ :** రోజురోజుకీ పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణ, అవసరమైన వ్యవస్థల కోసం రూ॥లక్ష కోట్లదాకా వెచ్చించాలి.

**వీధి దీపాలు :** రోడ్లపై ప్రతి 40 మీటర్లకు ఒక వీధి దీపాన్ని ఏర్పాటు చేయడం. వాటి బల్బులు ఎల్ఈ డీకి మార్చడం కోసం రూ॥ 18,580 కోట్లు ఖర్చు చేయాలి. ■

## సూక్ష్మ రుణ సంస్థలపై నియంత్రణ వ్యవస్థ

చిన్న మొత్తాల్లో రుణాలు తీసుకొనే వారి ప్రయోజనాలు కాపాడేందుకు సూక్ష్మరుణ సంస్థలపై నియంత్రణకు ఒక వ్యవస్థ అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇటువంటి నియంత్రణ వ్యవస్థను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి శశికాంత్ శర్మ తెలిపారు. సూక్ష్మ రుణ రంగంలో చట్ట విరుద్ధ కార్యకలాపాలను కట్టడి చేయడానికి ఈ వ్యవస్థ తోడ్పడగలదని అభిప్రాయపడ్డారు. ఒక్కసారిగా రుణాలకు గిరాకీ పెరిగిపోవడంతో కొన్ని సంస్థలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని చెప్పారు. ఆర్థిక, బ్యాంకింగ్ సేవల విస్తరణకు సూక్ష్మ రుణ రంగం కీలకమని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.

# వ్యవసాయాన్ని లాభసాటి చేసే వ్యూహం లేని కేంద్ర బడ్జెట్

- పి. భాస్కరరావు

**2011-12** బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ వ్యవసాయం మీద ఎన్నో మంచిమాటలు చెప్పారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న అనేక బలహీనతల్ని విశ్లేషించారు. మార్పు జరగాలన్న అకాంక్షల్ని వ్యక్తం చేశారు. అంతిమంగా రైతులకు వ్యవసాయాన్ని లాభసాటి చెయ్యాలన్న అంశాన్ని దాటవేశారు. విధాన ప్రకటనలు చెయ్యడానికి ముఖం చాటేశారు.

ఈ బడ్జెట్‌లో ఉత్పత్తి పెంచడానికి కొన్ని అంశాల మీద దృష్టి సారించారు. జాతీయ కృషివికాస యోజన పథకం కింద తూర్పు రాష్ట్రాలకి హరిత విప్లవాన్ని అందించడం, వర్షాధార ప్రాంతాలలో 60,000 గ్రామాలలో పప్పుదినుసుల పంటల అభివృద్ధి పట్టణ పరిసరాలలో కూరగాయాల క్షేత్రాల సముదాయాలు, పోషకాహారపంటలైన సజ్జలు, జన్నలు, రాగుల పంటలకు ప్రోత్సహకాలు, ప్రొటీనులను అందించే పాడిపశువులు, గొర్రెలు, పందులు, చేపల పెంపకం మీద దృష్టి సారించడం, నూనెగింజల ఉత్పత్తుల్ని పెంచడానికి 60,000 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటల విస్తరణ, 25000 గ్రామాలలో పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు.

**వ్యవసాయ రంగం రైతాంగ సమస్యలు**

## పథకాలు బారెడు - కేటాయింపులు బెత్తెడు

హరిత విప్లవం కోసం 7 తూర్పు రాష్ట్రాలకు - అస్సాం, బెంగాల్, జార్ఖండ్, తూర్పు ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌ఘర్, ఒరిస్సా రాష్ట్రాలకు కేటాయించింది కేవలం 400 కోట్లు మాత్రమే.

పప్పు దినుసుల ఉత్పత్తికి 60,000 గ్రామాలకు 300 కోట్లు అంటే గ్రామానికి 50 వేల రూపాయలు కేటాయించారు. అలాగే ఆయిల్ పామ్, తృణధాన్యాలు, పశుగ్రాసం, పశు సంపదలకు తలా 300 కోట్లు కేటాయించారు. వాస్తవానికి ఈ పథకాల నిర్వహణ యంత్రాంగాల ఖర్చులు పోతే రైతులకు చేరేది నామమాత్రమే. ఇలాంటి అరకొర చర్యలు ఏ రంగాన్ని నిజమైన అభివృద్ధి మార్గంలో పెట్టలేవు. వ్యవసాయాభివృద్ధి మీద ప్రభావాన్ని చూపలేవు. పథకాల మోత వినిపించడమే గాని ఫలితాల జాడ కనిపించదు.




ఇవి కాకుండా బడ్జెట్‌లో ఘనంగా ప్రకటించింది రైతులకు ఇచ్చే వ్యవస్థాగత రుణాలను 3,75,000 కోట్ల నుండి 4,75,000 కోట్లకు పెంచనున్నట్లు సకాలంలో చెల్లించే రైతులకు అదనంగా 1 శాతం వడ్డీరేటు తగ్గింపును ప్రకటించారు. రైతుల అవసరాలలో 30 శాతానికి మాత్రమే వ్యవస్థాగత రుణాలు అందుతున్న నేపథ్యంలో ఈ పెంపుదల ఏ మాత్రం సరిపోయేది కాదు.

అలాగే ప్రభుత్వం దగ్గర ఆహారనిల్వలు 2011 జనవరి నాటికి రికార్డు స్థాయిలో 47 మిలియన్ టన్నులున్నాయి. 2007 జనవరి1తో పోల్చుకుంటే ఆనాటి 17.5 మిలియన్ టన్నుల అంటే 2.7 రెట్లు ఎక్కువగా వున్నాయి. ప్రభుత్వం తన నిల్వ సామర్థ్యాలను పెంచుకోడానికి 150 లక్షల టన్నులకు వేర్ హౌసింగ్ కార్పొరేషన్, ప్రయివేటు వ్యాపారవేత్తలతో కొత్త గిడ్డంగులు రానున్నాయి. అలాగే మరొక 2 మిలియన్ టన్నులకు పబ్లిక్ ఎంటర్ ప్రెన్యూర్స్ గ్యారంటీ పథకం కింద గిడ్డంగుల నిర్మాణం చేపట్టారు. గ్రామీణ గిడ్డంగుల ఏర్పాటు కింద మరో 2.4 మిలియన్ టన్నుల నిల్వలకు అనుమతించడం జరిగింది.

ఇంత చేసినట్లు కనిపిస్తున్నా ఇంకా సగం ఆహారధాన్యాలు ఆరుబైటనే పెట్టే పరిస్థితి మాత్రం కొనసాగుతుంది. ఇంతకు మించి బడ్జెట్‌లో వ్యవసాయరంగం గురించి చెప్పుకోదగ్గ అంశాలు లేవు.

### దాటవేసిన కీలక అంశం

రైతులు వ్యవసాయానికి దూరమవుతున్నారన్న విషయాన్ని అంగీకరిస్తూనే లాభసాటి వ్యవసాయానికి ఎలాంటి చొరవలనీ ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

ఆహారధాన్యాలు దేశంలో నిల్వ చేసుకోలేని స్థితిలో వున్నప్పుడు కూడా స్వేచ్ఛా మార్కెట్‌కు ప్రభుత్వం ద్వారాలు తెరవడం లేదు. దేశాన్నంతటినీ ఒకే స్వేచ్ఛామార్కెట్‌గా ప్రకటించడానికి రైతుల పంటల్ని ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ కల్పించడానికి ప్రభుత్వం ముందుకు రాలేదు.

అంతర్జాతీయ మార్కెట్లు రైతులకు అనుకూలంగా వున్న తరుణంలో కూడా విదేశీవాణిజ్యం మీద ఆంక్షలను ఎత్తివేయడానికి ప్రభుత్వం సిద్ధం కాలేదు.

అలాగే ఆహార ఉత్పత్తుల దిగుమతులకు సంబంధించి ముఖ్యంగా పామాయిల్ దిగుమతిలో ప్రభుత్వం రైతు వ్యతిరేక వైఖరిని తీసుకుంది. ఒక పక్క పామాయిల్ రైతులు తమ చెట్లను నరికివేస్తుంటే మరోపక్క 60,000 హెక్టార్లలో పామాయిల్ తోటల విస్తరణకు ప్రభుత్వం పూనుకోవడం విడ్డూరంగా వుంది.

ఇలా స్వేచ్ఛా మార్కెట్‌కు అనుమతించని ప్రభుత్వం దేశంలోనైనా కనీస మద్దత్తు ధరలను గరిష్ట స్థాయిలో పెంచడానికి కూడా సిద్ధం కావడం లేదు. ఈ చర్యలు చూస్తే 'అమ్మ పెట్టా పెట్టదు అడుక్కుతిననివ్వద'న్న సామెతను తలపుకొస్తున్నది. ఇక్కడ లాభసాటి ధరను ఇవ్వకుండా – లాభసాటి ధర వచ్చే అంతర్జాతీయ మార్కెట్లలో అమ్ముకోడానికి అనుమతినివ్వకుండా ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని దివాళా తీయిస్తూ వ్యవసాయరంగంలో రైతుల ఆత్మహత్యలకు కారణం అవుతున్నది.

ఈ బడ్జెట్ కేవలం వ్యవసాయ రంగానికి కంటితుడుపుచర్యలను ప్రకటించింది తప్ప లాభసాటి వ్యవసాయిన్ని దాటవేసి రైతులకు అన్యాయం చేసింది. ■

## కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు

### 2011-12 కేంద్రబడ్జెట్‌లో వ్యవసాయరంగానికి చేసిన కొన్ని కేటాయింపులు

- 2010-11 బడ్జెట్‌లో వ్యవసాయరంగంలో ప్రణాళికా కేటాయింపులు 17,254 కోట్లు వుంటే 2011-12 బడ్జెట్ 17,122 కోట్లు, అంటే 132 కోట్లు కోతపడింది.
- కేంద్రప్రణాళికలో 1230 కోట్లు కోతపెట్టే రాష్ట్రాల ప్రణాళికలకు 1098 కోట్లు అదనంగా కల్పించారు.
- తూర్పు రాష్ట్రాలకు హరిత విప్లవాన్ని విస్తరించడానికి 400 కోట్లు.
- 60,000 గ్రామాలలో పప్పుదినుసుల ఉత్పత్తికి 300 కోట్లు.
- 60,000 హెక్టార్లలో ఆయిల్ పాం తోటల విస్తరణకి 300 కోట్లు.
- పట్టణాల చుట్టూ కూరగాయాల సముదాయాల కోసం 300 కోట్లు.
- పౌష్టికాహార ప్రోత్సాహకంగా రాగి, సజ్జ, జన్న పంటలకు 300 కోట్లు.
- పాడిపశువులు, పందులు, గొర్రెలు, చేపల పెంపకాల వృద్ధికి 300 కోట్లు.
- 2500 గ్రామాలలో పశుగ్రాస అభివృద్ధికి 300 కోట్లు.

ఇవన్నీ రాష్ట్రీయ కృషి వికాసయోజన (ఆర్.కె.వి.వై) పథకం క్రిందకు వస్తాయి.

**పరపతి :** రైతులకిచ్చే పరపతి మొత్తం 3,75,000 కోట్ల నుండి 4,75,000 కోట్లకు పెంచనున్నారు. సకాలంలో అప్పులు చెల్లించే రైతులకి గతంలో 2 శాతం ఇస్తున్న వడ్డీరాయితీని 3 శాతానికి పెంచారు. అంటే 4 శాతం వడ్డీ చెల్లించాల్సివుంటుంది.

- తాత్కాలిక రుణాల నిమిత్తం నా బార్డుకు 2011-12లో 10,000 కోట్లు అందిస్తారు.
- 2011-12లో మరో 15 మెగా ఆహార పార్కులను మంజూరు.

# అంకెలకి, ఆచరణకి పొంతన లేని ఉపాధి శిక్షణా పథకాలు

**- దాట్ల శివాజీ**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు రానున్న 10 సంవత్సరాల్లో 4 కోట్ల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి గత ఏడాది 2009-2010 గాను 20,000 మందికి ప్రభుత్వం శిక్షణ ఇప్పిస్తే అందులో 75% మందికి మాత్రమే ఉపాధి దొరికింది. అంటే వారు చెప్పిన లెక్కల ప్రకారం సంవత్సరానికి 40 లక్షల మందికి శిక్షణ మరియు ఉపాధి లభించాలి. కానీ వాస్తవ పరిస్థితులలో కేవలం 20,000 మందికి శిక్షణ ఇవ్వగలిగారు. ఈ లెక్కన వారు చెప్పి 4 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలంటే 20,000 సంవత్సరాలు పడుతుంది. కాని 2022 కల్లా 20 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని మన కేంద్ర ఆర్థిక మంత్రిగారు బల్లగుద్ది చెప్పారు.

నిరుద్యోగులకు ఎక్కువగా కేంద్ర రాష్ట్ర స్కీమ్‌ల ద్వారా కార్పెంటరింగ్ ప్లంబింగ్ వంటి పనులు నేర్పిస్తున్నారు. ఈ యువకులకి సరైన శిక్షణ ఇవ్వక దాని ఫలితం నేర్చుకున్న వారిలో 60% మందికి ఉద్యోగాలు దొరకటం లేదు. మన ప్రభుత్వాలు ఎంతో గొప్పగా చెప్పుకునే జనాకర్షణ పథకాల్లో ఎస్.సి., ఎస్.టి.లు పారిశ్రామిక వేత్తలను చేసే పథకం దీనిలో పారిశ్రామిక విధానం ప్రకారం దాదాపు 10 వేల మంది ఎస్.సి.,ఎస్.టిలకు ఆహ్వానించింది. గత 6 ఏళ్ళలో కేవలం 921 మందికి మాత్రమే ప్రభుత్వం రుణాలు మంజూరు చేసింది. ఇందులో 890 మాత్రమే రాయితీ ఇచ్చింది. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అట్టడుగులో ఉన్న గిరిజనులకు పెద్దపీట వేస్తాము వారికి 35% చొప్పున పెట్టుబడి రాయితీని, ఈ రంగంలో మహిళలకు 45% రాయితీ ఇస్తామని పారిశ్రామిక విధానాల్లో పేర్కొన్నారు. ఈ రాయితీల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేస్తున్న వారికి సాయం అందించడం లో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. 2005-2011లో ప్రభుత్వం 55 కోట్లు ఎస్.సి.ల కోసం కేటాయించగా అందులో 48 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఎస్.టి.లలో 390 మాత్రమే రాయితీలను విడుదల చేసింది. పారిశ్రామిక విధానం అమల్లోకి వచ్చిన తొలి సంవత్సరం 2005-2006 5 ఎస్.సిలకు 3 ఎస్.టిలకు మాత్రమే రుణాలు అందాయి. రెండవ సంవత్సరం కేవలం 2 ఎస్.సిలకు రుణాలు అందగా ఎస్.టిలకు ఆ సంవత్సరం అందలేదు. 2007-2008లో 20 ఎస్.సిలకు ఈ లబ్ధి చేకూరింది. 2008-2009లో ఎస్.సి.,ఎస్.టిలకు కలిపి 160 మందికి రుణాలు మంజూరు అయ్యాయి. 2010లో ఎస్.సి.,ఎస్.టిల నిమిత్తం కేంద్రం అందిస్తున్న రాయితీ రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా వినియోగించు కోవడం లేదని ఆ మొత్తాన్ని వెనక్కి పంపేయాలని కేంద్రం ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై 308 ఎస్.సిలకు 297 ఎస్.టిలకు రుణాలు ఇచ్చింది. తాత్కాలిక ఓటు బ్యాంకు పథకాలకు వేల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం యువతకు శాశ్వతంగా ఉపాధినిచ్చే పథకాల మీద మాత్రం దృష్టి పెట్టడం లేదు.

**యువత కోసం...**

యువతని శాశ్వతంగా నిరుద్యోగులుగా కొనసాగించడమే మన ప్రభుత్వం ధ్యేయంగా కనబడుతుంది. ఎస్.సి.,ఎస్.టిలపై చూపించే వైఖరినే బి.సిలపైన ప్రభుత్వం చూపిస్తుంది. పొరుగున ఉన్న చైనా దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంత కీలకమో గుర్తించి అక్కడి ప్రభుత్వాలు 10 సంవత్సరాలలో 13 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తే మనము కేవలం 40 లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాము. చైనాను చూసి అయినా మన పాలకులు సిగ్గు తెచ్చుకోవాలని ఆశిద్దాం.

మన బడ్జెట్‌లో సెకండరీ విద్యలో వృత్తి విద్యాకోర్సులను ప్రవేశపెడతామని చెప్పారు. దీని అమలుకోసం ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారో స్పష్టత లేదు. 9,10 తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు ప్రవేశపెట్టడం అభినందించ దగ్గ విషయమే. అయితే దానికి ఎంత నిధులు కేటాయించారో ప్రస్తావించలేదు. మనకి తామర తంపరగా ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారు కాని పరిశోధన నిమిత్తం విశ్వవిద్యాలయాలు ఏమీ ప్రకటించలేదు. ప్రస్తుత 17-23 సంవత్సరాల వయస్సు ఉన్న వారిలో కేవలం 11శాతం అంటే 15 లక్షల మంది మాత్రమే ఉన్నత విద్యలో ప్రవేశిస్తున్నారు. అదే మలేషియాలో 27 శాతం, థాయ్‌లాండ్‌లో 19 శాతం ఉన్నత విద్య పొందుతున్నారు. మంచి ప్రమాణాలుగల ఉన్నత విద్య మనదేశంలో లేకపోవడంతో కనీసం 1,00,000 మంది విద్యార్థులు అమెరికా, బ్రిటన్ దేశాలలో వేల కోట్ల రూపాయలు చదువుకోసం ఖర్చుచేస్తున్నారు. మంచి ప్రమాణాల విద్య, నైపుణ్యాల శిక్షణ లేక యువతరం ఉపాధి అవకాశాలను అందుకోలేకపోతున్నది. ■

# సంస్థాగత విస్తరణ దిశగా లోక్‌సత్తా పార్టీ

## మూడుదశలు - ముఖ్యలక్ష్యాలు

లోక్‌సత్తా పార్టీ సంస్థాగత విస్తరణకు 66 మున్సిపాలిటీలు / కార్పొరేషన్లను 55 మండలాలను ఎంపిక చేయడం జరిగింది. ఇక్కడ నిర్ధిష్టమైన కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర పార్టీ కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. మూడు దశలుగా విభజించి ప్రతిరెండు నెలలకు ముఖ్య లక్ష్యాలను రూపొందించింది. కార్పొరేషన్ డివిజన్లకు, మున్సిపల్ పట్టణాలకు / మండలాలకు సంస్థాగత నిర్మాణం పట్ల ఆసక్తి గలవారు వ్యక్తిగత బాధ్యతతో దీనిని నిర్వహించాలని తలపెట్టింది. బాధ్యత తీసుకున్న వారు ప్రత్యక్ష నాయకత్వాన్ని అందించడం ద్వారా, పట్టణంలో / మండలంలో / కార్పొరేషన్ డివిజన్లలో పెట్టుకున్న లక్ష్యాలను సాధించాలని పార్టీ భావించింది.

### మొదటిదశ:

జనవరి - ఫిబ్రవరి మాసాలలో సంస్థాగత విస్తరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. సభ్యత్వ నమోదు, పార్టీ స్వయంపోషణకు విరాళాల సేకరణ, సభ్యుల భాగస్వామ్యానికి జనరల్ బాడీ సమావేశాలు, స్థానిక ప్రజల సమస్యల మీద ప్రచార ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. మొత్తంమీద రాష్ట్రంలో 41 మంది కార్యక్రమాలను ప్రారంభించి తమ బాధ్యతను నిర్వర్తించడంలో మంచి కృషి చేశారు. మరో 75 మంది ఇంకా ప్రాథమిక స్థితిలోనే వున్నారు.

### రెండవదశ : మార్చి - ఏప్రిల్ నెలల కార్యకలాపాలు

1. మార్చి- ఏప్రిల్ నెలలలో పార్టీ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ కొనసాగించుకోవాలి. సభ్యత్వ నమోదు లక్ష్యాలను సాధించుకోవాలి.

2. నమోదు చేసిన సభ్యత్వాన్ని పట్టణంలో వార్డు శాఖలుగా, మండలంలో గ్రామశాఖలుగా, నగరాలలో డివిజన్ల లోపల కాలనీ/బస్తీ శాఖలుగా విభజించి వాటికి జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించుకోవాలి. **రాష్ట్ర కార్యవర్గం ఆమోదించిన 2011 - సంస్థాగత ఎన్నికల నియమావళి ఆధారంగా ఎన్నికలు నిర్వహించుకోవాలి.**

3. ఒక పట్టణం / మండలం / కార్పొరేషన్ డివిజన్‌లలో ఎన్నికల నియమావళి ప్రకారం తగిన శాఖలు ఏర్పడి, ఎన్నికలు నిర్వహించుకున్న తర్వాత పట్టణ / మండల / కార్పొరేషన్ డివిజన్ స్థాయి ఎన్నికలు జరుపుకోవాలి.

4. **పార్టీ శిక్షణ :** (ఎ) సంస్థాగత ఎన్నికలు జరుపుకున్న మున్సిపల్ పట్టణ వార్డులలో / కార్పొరేషన్ డివిజన్లలో పార్టీ సభ్యులకు అభిమానులకు వార్డు స్థాయి / డివిజన స్థాయిలో ఒక్కరోజు శిక్షణాకార్యక్రమాన్ని నిర్వహించుకోవాలి.
(బి) సంస్థాగత ఎన్నికలు జరుపుకున్న మహిళాసత్తా / యువసత్తా / సర్వజన సత్తా పట్టణ / మండల శాఖలలో సభ్యులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలి.
(సి) మండలస్థాయిలో రైతులకు ప్రత్యేకంగా **"వ్యవసాయాన్ని లాభసాటిచేసుకుందాం - రండి"** అన్న పేరుతో ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలి.

### మార్చి - ఏప్రిల్ నెలలలో

(1) సభ్యత్వ నమోదు లక్ష్యాలు సాధించండి.

(2) పార్టీ విరాళాల సేకరణ లక్ష్యాలు సాధించండి.

(3) వార్డు / గ్రామ / కాలనీ శాఖలను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించండి.

(4) వీలైన చోట్ల పట్టణ / మండల / డివిజన్ స్థాయి ఎన్నికలు కూడా జరుపుకోవచ్చును.

(5) వివిధ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించండి.

పార్టీ సభ్యులు, కార్యకర్తలు అందరూ ఈ కార్యక్రమాలలో పాలుపంచుకోండి. పట్టణం / మండలం / కార్పొరేషన్ డివిజన్‌లకు బాధ్యతలు తీసుకున్న వారు ఈ లక్ష్యాల సాధన మీద పట్టుదలతో కృషి సాగించాలి.

**- వి. లక్ష్మణ్ బాలాజీ**
లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యదర్శి

# లోక్‌సత్తా పార్టీ

# సంస్థాగత ఎన్నికల నియమావళి - 2011

**2011 మార్చి 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం లోక్‌సత్తా పార్టీ సంస్థాగత ఎన్నికల నియమావళి 2011 ను ఆమోదించింది. దీని ఆధారంగా సంస్థాగత ఎన్నికలను నిర్వహించుకోవాలి.**

## 1. పార్టీ సభ్యత్వంలో తరహాలు

**(ఎ) జీవిత సభ్యులు (రూ॥ 10,000) / ఎగ్జిక్యూటివ్ సభ్యులు (రూ॥1000)**

**(బి) క్రియాశీల సభ్యులు (రూ॥100)**

**(సి) ప్రాథమిక సభ్యులు (రూ॥10)**

**(మార్పు :** ప్రస్తుత ప్రాథమిక సభ్యులను క్రియాశీల సభ్యులుగాను, ప్రస్తుత అసోసియేట్ సభ్యులను ప్రాథమిక సభ్యులుగా పరిగణించాలి.)

## 2. పార్టీ సభ్యులు - ఓటింగ్ హక్కులు

జీవిత/ఎగ్జిక్యూటివ్ సభ్యులకు అన్నిస్థాయిలలో ఓటింగ్ హక్కునూ, సంస్థాగత ఎన్నికలలో అన్ని స్థానాలకు పోటీ చేసే హక్కునూ కలిగి వుంటారు.

క్రియాశీల సభ్యులు నియోజక వర్గం / పట్టణ / మండల / కార్పొరేషన్ డివిజన్‌లో స్థాయిలో ఆఫీసు బేరర్లతో సహా అన్ని పదవులకు అర్హులుగా వుంటారు.

క్రియాశీల సభ్యులు జిల్లా స్థాయిలలో ఆఫీసు బేరర్లు మినహా కమిటీ సభ్యత్వాలకు పోటీకి అర్హులుగా వుంటారు.

ప్రాథమిక సభ్యులు గ్రామ / వార్డు / కార్పొరేషన్ డివిజన్ దిగువన వుండే కాలనీ, బస్తీల పార్టీ శాఖలలో జనరల్ బాడీ సభ్యులుగా వుంటారు. ఈ స్థాయిలో జరిగే సంస్థాగత ఎన్నికలలో ఆఫీసు బేరర్లు మినహా ఇతర కార్యవర్గ స్థానాలకు అర్హులుగా వుంటారు.

## 3. సంస్థాగత ఎన్నికలకు సభ్యత్వ ప్రాతిపదికలు

గ్రామస్థాయిలో కనీసం ముగ్గురు ఎగ్జిక్యూటివ్ లేదా క్రియాశీల సభ్యులు మరియు 10 మంది ప్రాథమిక సభ్యులు వుంటే గ్రామశాఖ ఎన్నికలు జరుపుకోవచ్చును.

పట్టణ వార్డు స్థాయిలో కనీసం 5 మంది ఎగ్జిక్యూటివ్ లేదా క్రియాశీల సభ్యులు మరియు 20 మంది ప్రాథమిక సభ్యులు వుంటే వార్డు శాఖకు ఎన్నికలు జరుపుకోవచ్చును.

కార్పొరేషన్ డివిజన్లలో 20 మంది ఎగ్జిక్యూటివ్ లేదా క్రియాశీల సభ్యులు మరియు 50 మంది ప్రాథమిక సభ్యులు వుంటే డివిజన్ శాఖ ఎన్నికలు జరుపుకోవచ్చును.

కార్పొరేషన్లలో డివిజన్‌స్థాయి శాఖకు దిగువన వుండే కాలనీ, బస్తీశాఖలకు గ్రామశాఖ ప్రాతిపదిక వర్తిస్తుంది.

**4. (ఎ)** మండల స్థాయిలో ఎన్నికలు జరుపుకోడానికి మండలంలో కనీసం 5 గ్రామశాఖలకు ఎన్నికలు జరిగివుండాలి. మండలం మొత్తం మీద కనీసం 20 ఎగ్జిక్యూటివ్ లేదా క్రియాశీల సభ్యులు మరియు 70 మంది ప్రాథమిక సభ్యులు వుండాలి.

**(బి)** మున్సిపల్ పట్టణంలో కనీసం 5 వార్డుశాఖలకు ఎన్నికలు జరిగివుండాలి. మొత్తం పట్టణంలో కనీసం 30 మంది ఎగ్జిక్యూటివ్ లేదా క్రియాశీల సభ్యులు మరియు 100 మంది ప్రాథమిక సభ్యులు వుంటే పట్టణశాఖ ఎన్నికలు జరుపుకోవచ్చును.

**(సి)** కార్పొరేషన్లలో కనీసం 10 డివిజన్ శాఖలకు ఎన్నికలు జరిగివుండాలి. అలాగే కనీసం 200 మంది ఎగ్జిక్యూటివ్ లేదా క్రియాశీల సభ్యులు మరియు 300 మంది సాధారణ సభ్యులు మొత్తం మీద 500 సభ్యత్వం వుంటే ఎన్నికలు జరుపుకోవచ్చును.

## 5. నియోజక వర్గంలో సంస్థాగత ఎన్నికలు

కనీసం రెండు పట్టణాలు లేదా మండలాలలో / కార్పొరేషన్ నియోజకవర్గాలలో 5 డివిజన్‌లలో ఎన్నికలు జరిగివుండాలి. 50 మంది ఎగ్జిక్యూటివ్ లేదా క్రియాశీల సభ్యులు మరియు 150 మంది ప్రాథమిక సభ్యులు మొత్తం మీద 200 మంది సభ్యులు వుంటే ఎన్నికలు జరుపుకోవచ్చును.

## 6. జనరల్ బాడీలు

**(ఎ)** గ్రామ / వార్డు / కార్పొరేషన్ డివిజన్‌లలో బస్తీ, కాలనీ శాఖలకు ఎగ్జిక్యూటివ్, క్రియాశీల, సాధారణ సభ్యులంతా జనరల్ బాడీ సభ్యులు అవుతారు.

**(బి)** మండలం / పట్టణం / కార్పొరేషన్ డివిజన్లకు ఆ పరిధిలోని అందరు ఎగ్జిక్యూటివ్ /క్రియాశీల సభ్యులు, గ్రామ/ వార్డు / కాలనీ బస్తీ శాఖల కార్యవర్గసభ్యులంతా జనరల్ బాడీ సభ్యులు అవుతారు.

**(సి)** నియోజక వర్గాలకు దాని పరిధిలోని అందరు ఎగ్జిక్యూటివ్ లేదా క్రియాశీల సభ్యులు మరియు మండల/పట్టణ/గ్రామ/ వార్డు కార్యవర్గ సభ్యులు జనరల్‌బాడీ సభ్యులుగా వుంటారు.

## 7. ఆఫీసు బేరర్లు - కార్యవర్గాలు

**(ఎ)** గ్రామ/వార్డు/కార్పొరేషన్ డివిజన్ దిగువ కాలనీ / బస్తీ శాఖలకు ముగ్గురు ఆఫీసు బేరర్లు అధ్యక్షులు, కార్యదర్శి, ఉపాధ్యక్షులు వుంటారు. మరో నలుగురు కార్యవర్గ సభ్యులుగా వుంటారు.

**(బి)** పట్టణ / మండల / డివిజన్ స్థాయిలో 7 మంది ఆఫీసు బేరర్లు, మరో 4గురు సభ్యులతో పాటు అందరు వార్డు / గ్రామశాఖల అధ్యక్ష / కార్యదర్శులు కమిటీ సభ్యులుగా వుంటారు.

**(సి)** నియోజక వర్గ కార్యవర్గం: ఇందులో 9 మంది ఆఫీసు బేరర్లు అధ్యక్షుడు, 3 ఉపాధ్యక్షులు, కార్యదర్శులు 3 సహాయ కార్యదర్శులు, కోశాధికారి వుంటారు. వీరితో పాటు అదనంగా మరో 5 మంది సభ్యులు, పట్టణ / మండల అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ సభ్యులుగా వుంటారు.

పట్టణ / మండల / డివిజన్ / నియోజకవర్గ కార్యవర్గాలలో అదనంగా ఇస్తున్న సభ్యుల సంఖ్యను మహిళలు, యువత, బలహీనవర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి వినియోగించుకోవాలి.

## 8. ఎన్నికల అథారిటీ

రాష్ట్రస్థాయి ఎన్నికల అథారిటీని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు ప్రకటిస్తారు. వారు జిల్లా పార్టీ అధ్యక్షులతో సంప్రదించి జిల్లా ఎన్నికల అథారిటీలను ప్రకటిస్తారు.

జిల్లా ఎన్నికల అథారిటీలు గ్రామ / వార్డు / కాలనీ బస్తీశాఖల ఎన్నికలకు, పట్టణ /మండల / డివిజన్ ఎన్నికలకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది. నియోజకవర్గ ఎన్నికలు నిర్వహిస్తుంది. రాష్ట్ర ఎన్నికల అథారిటీ జిల్లాశాఖ ఎన్నికలను, రాష్ట్ర శాఖ ఎన్నికలను నిర్వహిస్తుంది.

**(జిల్లా, రాష్ట్ర శాఖ ఎన్నికల నియమావళి తర్వాత ప్రకటించబడుతుంది.)** ■

### లోక్‌సత్తా టైమ్స్‌కు కార్యకలాపాల వార్తలు పంపించే వారికి సూచన

**లోక్‌సత్తా టైమ్స్‌లో ప్రచురించడానికి మీరు పంపించే కార్యక్రమాల వార్తలను ప్రత్యేకంగా "ఎడిటర్ లోక్‌సత్తా టైమ్స్" పేరుమీద పంపించాలి. వాటినే పరిశీలించడం జరుగుతుంది. మీరు ప్రజా సమస్యలపై చేసే కార్యక్రమాలు, శిక్షణకు సంబంధించిన కార్యక్రమాల వార్తలను మాత్రమే పంపండి. పత్రికా ప్రకటనలు పంపకండి. మీరు పంపించే ఫొటోల వెనుక ఆ కార్యక్రమ వివరాలను రాయండి.**

– ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్


## FORM IV

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity | : | Fortnightly |
| 3. Printer's | : | |
| a. Name | : | Dr. Jaya Prakash Narayan |
| b. Nationality | : | Indian |
| c. Address | : | 801, Srinivasa Towers, Beside Kakatiya Hotel, Greenlands, Hyderabad 500 016 |
| 4. Publisher's Name | : | Dr. Jaya Prakash Narayan |
| 5. Editor's Name | : | Dr. Jaya Prakash Narayan |
| Nationality | : | Indian |
| Address | : | 801, Srinivasa Towers, Beside Kakatiya Hotel, Greenlands, Hyderabad 500 016 |
| 6. Name and Address of individual (S) Who own the Newspaper and partners of than One percent of the total capital | : | Foundation for Democratic Reforms Represented by Dr. Jaya Prakash Narayan, 801, Srinivasa Towers, Beside Kakatiya Hotel, Greenlands, Hyderabad 500 016 |

I, Dr. Jaya Prakash Narayan hereby declare that the particulars given above are true to the best of my knowlledge and belief.

(Sd) (Jaya Prakash Narayan)
Signature of the Publisher

# రాజకీయ పార్టీ ... ఉపాధి వారధి

## ఉద్యోగాలు ఇంటర్వ్యూలు - క్యూ కడుతున్న యువత

అది కేపీహెచ్‌బీలోని ఓ రాజకీయ పార్టీ కార్యాలయం. ధవళ వస్త్రాల్లో మెరిసిపోతూ పెద్ద కార్లలో వచ్చిపోయే నాయకులెవరూ అక్కడ ఉండరు. కార్యకర్తల హడావుడి అసలే కనిపించదు. కానీ... ఇదేదో కాలేజీ అన్నట్టు.. ఫైళ్లు పట్టుకుని పెద్ద సంఖ్యలో యువతీ యువకులు కనిపిస్తారు. ఎందుకంటే నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వారధిగా పనిచేస్తుంది కాబట్టి. అదే... లోక్‌సత్తా పార్టీ కార్యాలయం.

‘ లోక్‌సత్తా’ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేయడమే కాకుండా ... యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తోంది. నిరుద్యోగులకు, పరిశ్రమలకు మధ్య వారధిగా వ్యవహరిస్తోంది. జేఎన్‌టీయూహెచ్ సమీపాన సర్దార్ పటేల్‌నగర్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో గత ఆగస్టు నుంచి జాబ్‌మేళాలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. వీటి పర్యవేక్షణకు గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేసిన జి. సాంబిరెడ్డి అనే కార్యకర్తను పార్టీ నియమించింది. ఈ ఏడు నెలలో 37 పర్యాయాలు ఇంటర్వ్యూలు ఏర్పాటుచేయగా... మొత్తం 417 మంది ఉపాధి పొందారు. బజాజ్, ఎయిర్‌టెల్, యురేకా ఫోర్బ్స్, స్పిక్ ఇండియా, కార్వీ తదితర కంపెనీల మానవ వనరుల నిపుణులు పార్టీ కార్యాలయమే వేదికగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. మార్కెటింగ్, సేల్స్, డాటా ఎంట్రీ, ఎలక్ట్రీషియన్లు, సెక్యూరిటీ గార్డ్స్ వంటి చిన్న ఉద్యోగాలకు సైతం ఎంతో మంది ఎంపికయ్యారు. ఇంటర్వ్యూల తర్వాత ఎంపికైనా వారికి ఎస్ఎంఎస్‌లు పంపుతారు. www.kukatpallynow.com వెబ్‌సైట్‌లో సైతం ఫలితాలను చూసుకోవచ్చు. ఎంపిక కానివారికి తదుపరి ఇంటర్వ్యూ తేదీల గురించీ చెబుతారు.

### ఉద్యోగార్థులకు శిక్షణ...

ఆయా ఉపాధి అంశాల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ సైతం ఇస్తుండటం విశేషం. మల్టీ మీడియా, కంప్యూటర్ అంశాల్లో కొన్ని సంస్థల సహకారంతో తర్ఫీదు ఇస్తున్నారు. త్వరలో పోలీసు కానిస్టెబుల్ పోస్టులకు సంబంధించి 30 మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇవన్నీ రాజకీయ కోణంలో కాకుండా సేవాదృక్పథంతో పార్టీ తరఫున చేస్తున్న కార్యక్రమాలు.

**సెట్విన్ సూచన మేరకు...: గొంతు సాంబిరెడ్డి**
నియోజకవర్గ అభివృద్ధి విభాగం

సెట్విన్ సూచన మేరకు పార్టీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఆసక్తి చూపాం. పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ పై విశ్వాసంతో పలు కంపెనీలు మా కార్యాయమే వేదికగా ఇంటర్వ్యూలు చేపడుతున్నాయి. కంపెనీల ప్రతినిధులు ఎవరైనా వస్తే వారితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకుని... నమ్మకం కుదిరాకే ఇంటర్వ్యూలకు అవకాశం ఇస్తున్నాం. ఇంటర్వ్యూల్లో కంపెనీ ప్రతినిధులే ఉంటారు. కొన్నింటికి సెట్విన్ ప్రతినిధులు హాజరవుతారు.

( ఈనాడు సౌజన్యంతో...)

**అనంతపురం**

### దీర్ఘకాలిక లక్ష్యాలతోనే ముందుకు

**అనంతపురం:** లోక్‌సత్తా పార్టీ ధనరాజకీయాలు చేయదు. జనరాజకీయాలు చేస్తూ దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు పోతుందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నేత ఓంకార్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలు అవినీతి అనే బురదలో మునిగి తేలుతున్నాయన్నారు. పార్లమెంటులో అవినీతి వ్యతిరేక బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి వన్నూరప్ప మాట్లాడుతూ.. పార్టీలో ఇప్పటి వరకు 1172 మంది సభ్యత్వం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళాసత్తా అధ్యక్షురాలు సరస్వతమ్మ, నాయకులు నిజాం, మధు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహిళా కమిషన్‌ను నియమించండి

## గవర్నర్‌ను కలిసిన మహిళాసత్తా నేతలు

రాష్ట్రంలో నాలుగేళ్లుగా మహిళా కమిషన్ లేకపోవటం వల్ల అనేకమంది బాధిత మహిళలకు సరైన న్యాయం అందటం లేదని, వెంటనే తగినంతమంది సిబ్బంది, సదుపాయాలతో మహిళా కమిషన్‌ను నియమించాలని మార్చి7న రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు లోక్‌సత్తా పార్టీ అనుబంధ మహిళాసత్తా రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మహిళాసత్తా రాష్ట్ర కమిటీ నేతలు కె. గీతామూర్తి, డి. లక్ష్మి, జి. రమాదేవి, టి. పద్మజారాణి, ఎస్. గజానని, పి. భవాని సోమవారం గవర్నర్‌ని రాజ్‌భవన్‌లో కలిసి విజ్ఞాపన పత్రం అందచేశారు.

అసమానత, వివక్ష, అణచివేతల నుంచి మహిళలకు రక్షణ కల్పించటానికి రూపొందించిన చట్టాల్లో భాగంగా 1998లో ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చట్టం ఏర్పాటైందని, ఆ చట్టం ప్రకారం 1999లో ఏర్పాటైన కమిషన్ పూర్తికాలం పాటు పనిచేసినా 2005లో ఏర్పాటైన కమిషన్ 2007 వరకే పనిచేయటంతో దాదాపు 2000కేసులు అప్పటికి పెండింగ్‌లో ఉన్నాయని మహిళాసత్తా నేతలు తెలిపారు. చైతన్యం పెరుగుతుండటంతో మహిళల అక్రమరవాణా, రేప్, లైంగిక వేధింపులు, స్త్రీలను అసభ్యంగా చూపటం, గృహహింస తదితర సమస్యలపై ఫిర్యాదులకు ముందుకొచ్చేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. కమిషన్ నియామకంలో ప్రభుత్వ ఉదాసీనత వల్ల బాధితులకు న్యాయం అందటం లేదన్నారు. ఈ నేపథ్యంలో దిగువ పేర్కొన్న నాలుగు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు గవర్నర్‌ను కోరారు...

1. పూర్తిస్థాయి మహిళా కమిషన్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలి.
2. కమిషన్ సభ్యులు రాజకీయాలతో సంబంధంలేని వారై ఉండాలి. న్యాయ లేదా సామాజిక నేపథ్యం నుంచి వచ్చినవారినే నియమించాలి.
3. కమిషన్‌కు వచ్చే కేసులు పెరుగుతన్న దృష్ట్యా సిబ్బందిని పెంచాలి. ఖాళీగా ఉన్న డైరెక్టర్ తదితర పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
4. రాష్ట్రంలోని మహిళలందరికీ అందుబాటులో ఉండేలా 24గంటలూ పనిచేసే టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను కమిషన్ ఏర్పాటు చేసేలా చూడాలి. ■

# పారిశుద్ధ్య కార్మికులతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ 100వ వార్షికోత్సవాన్ని లోక్‌సత్తా అనుబంధ 'మహిళాసత్తా' మార్చి 8న రాష్ట్ర రాజధాని పారిశుద్ధ్య కార్మికుల మధ్య నిర్వహించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో వివిధ గ్రూపుల మహిళా పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని మహిళా సాధికారత దిశగా తమ భావాల్ని పంచుకున్నారు. ఒక రాజకీయ పార్టీ ఇలాంటి సమావేశాన్ని తమతో నిర్వహించటం ఇదే తొలిసారని వారు హర్షం వ్యక్తం చేశారు. మహిళాసత్తా రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి, రాష్ట్ర నేతలు కె. గీతామూర్తి, డి.లక్ష్మి, ఎస్. మనోరమ, ఇ. శైలజ, అన్నపూర్ణ, పద్మారాణి మరియు జిహెచ్ఎమ్‌సి మహిళాసత్తా నేతలు టి. పద్మజారాణి, వై. రమాదేవి, భవానీ, శివనాగలీల తదితరులు కార్మికులకు కాలుష్య నివారణ మాస్కుల్ని, డెట్టాల్ సబ్బులు, మిఠాయిల్ని అందచేసి తమ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం చర్చాకార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇంట్లోనూ, వృత్తిలోనూ తమకు నిర్ణయాధికారం లేదని, రాజకీయాల గురించి అవగాహన లేదని మహిళా కార్మికులు తెలిపారు. కష్టపడి సాధించిన సంపాదనను ఇంట్లో మగవాళ్ల మద్యంకు వెచ్చించటం వల్ల నష్టపోతున్నామన్న ఆవేదనను అనేకమంది వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కృషి వల్ల కూకట్‌పల్లిలో దాదాపు 87 గ్రూపులకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు లంచాలకు ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా జీతాలు అందించే ఏర్పాటు చేయటంతోపాటు పీఎఫ్ వంటి సదుపాయాలు కూడా వచ్చేలా చేశారని తెలిపినప్పుడు... తమలో ఇంకా ఆ సదుపాయాలు లేనివారు ఉన్నారన్నారు. పూర్తి స్వావలంబన సాధించి తమ సమస్యలను తామే పరిష్కరించుకోలేకపోవటానికి చదువు లేకపోవటం ప్రధాన కారణమని వారు అంగీకరించారు. తమ సమస్యల్ని సొంతంగా పరిష్కరించుకుని, సామర్థ్యాన్ని పెంచుకోవాలని, నాయకత్వ బాధ్యతల్ని చేపట్టాలని ఆకాంక్ష ఉన్నా ఇప్పుడు సరైన దిశానిర్దేశం లేదని వారు వాపోయారు. ఇలాంటి సమావేశాలు మరిన్ని నిర్వహించి తమకు అవగాహన కలిగించాలని, పారిశుద్ధ్య కార్మికులు కోరగా, వారి సాధికారత దిశగా అన్నిరకాలుగా సహాయసహకారాలను అందిస్తామని మహిళాసత్తా నేతలు హామీ ఇచ్చారు. ■

# జిల్లాలలో లోక్‌సత్తా కార్యకలాపాలు

## ప్రకాశం

### జేపీపై దాడికి నిరసనగా విద్యార్థుల ప్రదర్శన

**ఒంగోలు :** అవినీతిరహిత సమాజం కోసం పోరాడుతున్న లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్‌పై అసెంబ్లీ ప్రాంగణంలో తెరాస ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఏపిటీసీఏ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం నుంచి ట్రంకు రోడ్డు మీదుగా అద్దంకి బస్టాండు వరకు ప్రదర్శన కొనసాగింది. ఈసందర్భంగా ఏపీటీసీఏ అధ్యక్షులు పి.కిషోర్ మాట్లాడుతూ.. భావప్రకటనా స్వేచ్ఛను ప్రతిబింబించాల్సిన అసెంబ్లీలో జేపీపై తెరాస నాయకులు వీధి గూండాల్లా దాడి చేయడం అమానుషమన్నారు. ఏపీటీసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిబాబు మాట్లాడుతూ...రాష్ట్రంలో తెలంగాణా ఉద్యమం పేరుతో దాడులు చేస్తున్న తెరాసపై నిషేధం విధించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మల్లిఖార్జునరావు, వసుంధరాదేవి, రవిరాజ్, మాధవరావు, రాంబాబు, జానీ, కె.వెంకటరావు, ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, రాఘువ, ధనుంజయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత సన్నద్ధం కావాలి

**ఒంగోలు:** రాష్ట్రంలో రోజురోజుకు దిగజారుతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు యువత సన్నద్ధం కావాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త జయప్రకాష్ నారాయణ్‌పై అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని ముక్తకంఠంతో ఖండించారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేస్తున్న జేపీపై దాడి చేయడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమే అవుతుందని అన్నారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లు శివరమేష్ రెడ్డి మాట్లాడుతూ.. జేపీపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకునేందుకు యువత సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకులు పాటిబండ్ల గోపాలస్వామి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో విలువలకు కట్టుబడి పనిచేస్తున్న జేపీపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకురాలు డాక్టర్ రాధాదేవి, తెలుగు మహిళా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి టి.అరుణ, సీపీఐ నాయకుడు యు. ప్రకాశరావు, సీపీఎం నాయకుడు శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, ఎం. చైతన్య ప్రసాద్, ఎండి.ఆయూబ్, పద్మ, కుసుమకుమారి, వివిధ సంఘాల నాయకులు జి. వసంత్, ఎ. అన్నపూర్ణ, రాయపాటి జగదీష్, ఎస్‌డి సర్దార్, సిహెచ్.లక్ష్మీ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

**విద్యా సంస్థల బంద్...** జేపీపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఒంగోలులో విద్యా సంస్థలు బంద్ పాటించాయి. పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు ఇంజనీరింగ్ కళాశాలల్లో బంద్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాయపాటి జగదీష్, నాగరాజు, ఇ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు గోదావరి

### జేపీపై దాడికి నిరసన

**రాజమండ్రి:** జయప్రకాష్ నారాయణ్‌పై అసెంబ్లీలో ఆవరణలో తెరాస నాయకులు దాడికి పాల్పడినట్లు టీవీల్లో వార్తలు చూసిన వెంటనే పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలసి వచ్చే పార్టీలతో వెంటనే ఆందోళన చేయాలని నిర్ణహించారు. అదే రోజు సాయంత్రం స్థానిక దేవీచౌక్ ప్రాంతంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### అఖిల పక్ష సమావేశం

**రాజమండ్రి :** జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ 18వ తేదీ ఉదయం 11గం.లకు స్థానిక ఆనంరోటరీ ఏసీ హాలులో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ దినం పేరుతో అఖిల పక్షం, మేధావులు, ప్రజాస్వామ్యవాదులతో సుమారు 3 గంటల పాటు సమావేశం జరిగింది. వివిధపార్టీ నాయకులు, వివిధ ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్దసంఖ్యలో పాల్గొని జరిగిన దాడిని ఖండించాయి. సమావేశంలో తీర్మానాలు చేశారు. సమావేశంలో తెలుగుదేశం, కాంగ్రెస్, ప్రజారాజ్యం, సిపిఐ, సిపిఎం, జగన్‌వర్గం, బీజేపి, రాష్ట్రీయ ప్రజాకాంగ్రెస్ తదితర పార్టీల

నాయకులు పాల్గొన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న ఘటన, జేపీపై, పాలడగు వెంకట్రావు పై జరిగిన దాడిని ఖండిస్తూ తీర్మానాన్ని చేశారు. దౌర్జన్యానికి, హింసకు పాల్పడ్డ శాసన సభ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారిని శాసన సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించి, భవిష్యత్తులో చట్టసభల్లోనికి రాకుండా అనర్హులను చేయాలని మరలా ఇటువంటి సంఘటనలు పునారావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

## విజయనగరం



### జేపీపై దాడి అమానుషం: లోక్‌సత్తా ఆధ్వర్యంలో నిరసన

**విజయనగరం:** ప్రజాస్వామ్య ప్రభుత్వంలో నైతిక విలువల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ్‌పై దాడి జరపటం అమానుషమని పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. జేపీపై దాడికి నిరసనగా పట్టణంలో బాలాజీ జంక్షన్ వద్ద పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. దాడి చేసిన వారిని శిక్షించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ప్రతినిధులు ఐ.అనంతలక్ష్మి, ఎం.సుభద్రాదేవి, పి.వి.రమణ, దయానంద్, ఎస్.ఎర్రిబాబు, ఈశ్వరరావు, వర్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఖండించిన జిల్లా న్యాయవాదులు

లోక్‌సత్తా అధినేత, శాసనసభ సభ్యులు జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దాడిని జిల్లా న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. జిల్లా న్యాయవాదులు సంఘం అధ్యక్షులు వై. శ్రీనాథ్, కార్యదర్శి ఎం.శంకర్రావులు మాట్లాడుతూ.. శాసనసభప్రాంగణంలో అందరూ చూస్తుండగా టి.ఆర్.ఎస్. కార్యకర్తలు జేపీపై దాడి చేయడం అనైతికమని, దిగజారుడుతనమని దాడిచేసిన వ్యక్తిపై కేసునమోదు చేసి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

### ప్రముఖుల ఖండన

లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ పై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని డీసీసీ ఇన్‌చార్జి అధ్యక్షుడు కోలగుట్ల వీరభద్రస్వామి, జిల్లా టిడిపి అధ్యక్షురాలు శాసన సభ్యులు కోళ్ళ లలితకుమారి ఉత్తరాంధ్ర దళిత ఐక్యవేదిక అధ్యక్షులు ఆదాడ మోహన్ ప్రభృతులు జేపీపై దాడిని ఖండించారు.

## ఖమ్మం

### బాధిత కుటుంబాలకు పరామర్శ

**కొనిజర్ల :** సారాకు బానిసలై మండల పరిధిలోని తనికెళ్ళలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను లోక్‌సత్తా పార్టీ నాయకులు పరామర్శించారు. సర్వజనాసత్తా ఆధ్వర్యంలో ముఖాముఖి ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకున్నారు. సర్వజనాసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ.రావు, యువసత్తా రాష్ట్ర కార్యదర్శి కుడికాల ఆంజనేయులు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కమ్యూనిటీ హాలు స్థలంలో దేవతావిగ్రహాలు పెట్టి, ఆ భూమిని కబ్జా చేయడానికి కొందరు కుట్రపన్నుతున్నారని స్థానికులు నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా వైరా డివిజన్ ఇన్‌చార్జ్ కె.బాలస్వామి, కొణిజర్ల మండల ఇన్‌చార్జి బి.ఆదినారాయణ, యువసత్తా నాయకులు టి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### అవినీతి అంతమొందించాలి

**ఖమ్మం :** అవినీతిని అంతమొందించడంలో యువత కీలకపాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ ఫిఫ్త్ పిల్లర్ ఆర్గనైజేషన్ కన్వీనర్ పద్మభూపతి రాజు అన్నారు. స్థానిక కవిత డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవినీతిపై సెమినార్‌లో పాల్గని మాట్లాడారు. ప్రతి విద్యార్థి అవినీతిపై సమరశంఖం పూరించాలన్నారు. అవినీతి సమాజాభివృద్ధికి అవరోధంగా మారిందని కళాశాల ప్రన్సిపాల్ డా.రాధాకృష్ణ అన్నారు. దీనికి వ్యతిరేకంగా యువత పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రోజారాణి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ

### తెలంగాణ సమస్యపై కేంద్రం రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలి - బండారు రామ్మోహన్‌రావు

**మిర్యాలగూడ :** రోజురోజుకు జటిలమవుతున్న తెలంగాణ సమస్యపై కేంద్ర ప్రభుత్వం ఒక రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. మార్చి 12న మిర్యాలగూడలో విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ అంశంపై చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్రంలో నెలకొని ఉన్న అనిశ్చిత పరిస్థితి తొలగకపోగా కొనసాగించేందుకే దోహదపడ్డాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు డిల్లీకి వచ్చి తమ అభిప్రాయం చెప్పడానికి సిద్ధమైనప్పుడే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి వీలవుతుందని ప్రకటించడం కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో సహా ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా ప్రాంతాల వారిగా చీలిపోయిన విషయం హోంమంత్రి చిదంబరానికి తెలిసినప్పటికీ ఇలాంటి ప్రకటన చేయడం అనుచితమన్నారు. తెలంగాణ సమస్యకు తక్షణ పరిష్కారం చేపట్టకపోతే రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత క్షీణించిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పాలన అస్తవ్యస్థం, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని తద్వారా రాష్ట్ర ప్రజలు మరిన్ని కష్టాల్లో కూరుకపోతారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సంబంధిత పార్టీల నాయకులతో వేర్వరుగా చర్చించి అత్యధికుల అభిప్రాయంతో తుది పరిష్కారాన్ని ప్రకటించి అమలు చేయాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న శాసన సభలో తెలంగాణ అంశం చర్చకు ప్రవేశపెట్టి అన్ని ప్రాంతాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర భవిష్యత్తు పట్ల ఆమోదయోగ్యమైన పరిష్కారం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు మారేపల్లి శ్రీనివాస్ రెడ్డి, గోపి, నర్సింహా, సతీఫ్ ఖాన్, యూసుఫ్, జ్యోతి, పర్వేజ్ తదితరులున్నారు.



### సంఘటితంగా ఉద్యమిస్తేనే సమస్యల పరిష్కారం

విషయ పరిజ్ఞానంతో సంఘటితంగా ప్రజలు ఉద్యమించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్ రావు అన్నారు. గ్రామీణ యువజన నాయకత్వంపై మార్చి12న మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో జరిగిన శిక్షణా శిబిరంలో ఆయన నడిపించినప్పుడే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేని మానవ వనరులు మన దేశంలో ఉన్నా సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని అన్నారు. ప్రజలే పాలకులుగా, పాలకులు సేవకులుగా ఉండాలనే లక్ష్యంతో లోక్‌సత్తా పార్టీ ప్రజల్లో రాజకీయ చైతన్యం తేవడానికి రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణా తరగతులను నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యస్. మనోరమ, జిల్లా అధ్యక్షులు మారేపల్లి శ్రీనివాస్ రెడ్డి, యువసత్తా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజోలి నర్సింహా, ఎండి, లతీఫ్ ఖాన్, కార్యదర్శి యూసుఫ్, కుంచం గోపి, మహిళా అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి

### జయప్రకాష్ నారాయణ్‌పై దాడిని నిరసిస్తూ శాంతియుత ర్యాలీ

**సరూర్‌నగర్ :** అసెంబ్లీలో లోక్‌సత్తాపార్టీ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ్‌పై తెరాస చేసిన దాడిని నిరసిస్తూ కొత్తపేట చౌరస్తాలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కొట్టం జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీని వ్యతిరేకిస్తూ తెరాస నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చొచ్చుకొచ్చి ర్యాలీని అడ్డుకొని లోక్‌సత్తా పార్టీ జెండాలను, బ్యాడ్జీలను బలవంతంగా గుంజుకొని రోడ్డుపై వేసి తొక్కారు. ఈ శాంతి ర్యాలీపై తెరాస చేసిన దాడిని జంగయ్య యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ ర్యాలీలో పార్థసారధి, ఉప్పల సతీష్, నర్రె లింగం, చంద్ర, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో మార్చి 8వ మహిళా దినోత్సవం సందర్భంగా.....



కూకట్‌పల్లిలో...





మార్చి 8వ అంతర్జాతీయ మహిళాదినోత్సవం - జిహెచ్‌ఎంసిలో మహిళా పారిశుధ్య కార్మికులతో...



మహిళా కమీషన్ ఏర్పాటు కోరుతూ...
గవర్నర్‌కి మెమోరాండం



ఆసరా సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



బి.సి ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, హైదరాబాద్



రాయచోటిలో మహిళాసత్తా

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12

# జేపీ పై దాడికి నిరసనగా....


ఒంగోలులో...


అనంతపురంలో...


రంగారెడ్డి జిల్లా, కొత్తపేట


రాజమండ్రిలో...

To,

Book-Post

PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times

H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad